# ది బాంబాయి ఆంధ్ర మహాసభ & జింఖానా

## The Bombay Andhra Mahasabha & Gymkhana

సంపుటి - 81 | సంచిక - 04 | డిసెంబర్ - 2015


తెలుగు భాషా, సాహితీ, సంస్కృతి, కళల, క్రీడల వార్తా విశేషాల..

# దర్పణం



## నూతన సంవత్సర శుభాకాంక్షలు



HAPPY
NEW YEAR
2016
నూతన సంవత్సరము
మరియు
సంక్రాంతి
శుభాకాంక్షలు
CA. Ashok Rajagiri
98692 04444
www.rajagiri.in | email : ashokrajagiri@gmail.com
r.k.graphics
Advt.



# ది బొంబాయి ఆంధ్ర మహాసభ & జింఖానా

**The Bombay Andhra Mahasabha & Gymkhana**

10-C, Lakhamshi Napoo Road, Dadar (E), Mumbai - 400014, Tel.: 24144377 / 24144388, Fax : 24119832

Public Trust Regd. No. F-801 (Bom), Societies Regd. No. 1258/1943-44

Certificate of 80-G u/s of the I.T. Act No.: DIT(E)/MC/80G/277/2009-10

E-mail: mahasabha@gmail.com Web: www.bamsg.org

**దర్పణం** తెలుగు భాషా, సాహితీ, సంస్కృతీ, కళల, క్రీడల వార్తా విశేషాల పత్రిక **డిసెంబర్ - 2015**

**అధ్యక్షులు / సారథ్యం**

**సంగం ఏక్‌నాథ్**

**ప్రధాన కార్యదర్శి / సహకారం**

**యాపురం వెంకటేశ్వర్**

**ఉపాధ్యక్షులు / సంపాదకులు**

**సంగెవేని రవీంద్ర**

**సంపాదక వర్గం**

**ద్యావరిశెట్టి గంగాధర్**
ఉపాధ్యక్షులు, పరిపాలనా విభాగం

**వేముల మనోహర్,**
ఉపాధ్యక్షులు, సాంస్కృతిక విభాగం

**యెళిగేటి రాజ్‌కుమార్**
సంయుక్త కార్యదర్శి, పరిపాలనా విభాగం

**అల్లం నాగేశ్వరరావు**
సంయుక్త కార్యదర్శి, సాంస్కృతిక విభాగం

**పిట్ల బాలక్రిష్ణ**
సంయుక్త కార్యదర్శి, సాహిత్య, క్రీడా విభాగం

**బడుగు విశ్వనాథ్**
కోశాధికారి

**కటుకం గణేశ్**
ప్రజా సంబంధాల బాధ్యులు

**సంపాదక సహకారం**

**గాలి మురళీధర్**

**ఈ సంచికలో...**
మహాసభ కార్యక్రమవివరాలు, కవితలు, కథలు, వింతలు విశేషాలు, వ్యాసాలు... వార్తలు జోక్స్... కార్టూన్‌లు, ఇంకా ... మీకు నచ్చే, మీరు మెచ్చే, ఎన్నో ఫీచర్స్...

## చెప్పాలనుంది..



నమస్కారం...!

**మీ** అందరి ఆకాంక్షలకు అనురూపంగా ఆంధ్రమహాసభలో మరమ్మత్తుల పనుల ప్రణాళిక ఒక కొలిక్కి వస్తోంది. ఈ అంశాన్ని ఎంతో గంభీరంగా తీసుకున్నాం. నిపుణుల కమిటీ కూడా ఎంతో శ్రమిస్తోంది. టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి కావొస్తుంది. త్వరలోనే పనులు ప్రారంభం చేసేందుకు పూర్తిగా ప్రయత్నిస్తున్నాం.

అట్లాగే,

కార్యక్రమాలను కూడా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న విషయం మీరు గమనిస్తున్నారనే అనుకుంటున్నాం. పునర్నిర్మాణం పనుల్లో ఎంతో బిజీగా వున్నప్పటికీ కార్యక్రమాలు నిర్వహించేందుకు కూడా మేం ప్రయత్నిస్తూనే ఉన్నాం. డిసెంబర్ 26 నాడు ఘంటసాల జయంతి సందర్భంగా గానకచేరీతో పాటు ఆచార్య డా॥ఎన్.గోపిగారికి జీవసాఫల్య పురస్కార ప్రదాన కార్యక్రమాన్ని తలపెట్టాం.

అంతేగాక, జనవరి 17 నాడు సభ్యుల కోసం విహార యాత్రను నిర్వహించబోతున్నాం. వీటన్నింటిలో మీరంతా భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నాం. వాలీబాల్ శిక్షణా తరగతులు రెగ్యులర్‌గా జరుగుతున్నాయి. జింఖానాను కూడా ఆధునీకరించాలని అనుకుంటున్నాం. మీరందరి సహాయ సహకారాలుంటే అసాధ్యం ఏదీ కాదు.

ఆంధ్రమహాసభ మానస పత్రిక 'దర్పణం' పట్ల మీ అభిమానానికి ధన్యవాదములు. దర్పణం కోసం మీ రచనల్ని పంపిస్తూనే ఉండండి. పరిశీలించి ప్రచురిస్తాం. వీలైనంత తొందరలో విరాళాల సేకరణ కోసం ఒక మేగా కార్యక్రమాన్ని నిర్వహించే ప్రయత్నంలో ఉన్నాం. ఆంధ్రమహాసభ అభ్యున్నతి కోసం మీరు ఏవైనా సలహాలు, సూచనలు ఇవ్వాలనుకుంటే మీకు స్వాగతం పలికేందుకు మేం సిద్ధంగా ఉన్నాం.

కలిసి నడిచే అడుగుల సవ్వడి, కరచాలనాలు చేసుకున్న చేతుల రాపిడి విద్యుత్తు కంటే ఎక్కువ వేగంగా, వెలుగుగా ఉంటుంది. అందులో ఎంతో బలం ఉంటుంది. మనమంతా కలిసి నడవాలనీ కోరుకుంటూ, ఐక్యతను అభిలషిస్తున్నాం.

ధన్యవాదములతో,

**సంగం ఏక్‌నాథ్**
అధ్యక్షుడు

**యాపురం వెంకటేశ్వర్**
ప్రధాన కార్యదర్శి

## వేగుచుక్కై వెలుగుదాం...!

సాహితీ దర్పణం

- గొండ్యాల రమేశ్

మట్టితో బంధాన్ని
పెంచుకున్నోళ్ళం...
చెట్లు పుట్టలతో
స్నేహం చేసినోళ్ళం...
ఆకాశానికి హారతి పట్టినం
కరుణించిన మేఘాలతో
కలిసి సాగినం...
భూతల్లి ఎదపై నాగేటి సాల్లు చేసినం
పుట్లకొద్ది పంటదీసి
మానవాళికి ఆకలి తీర్చినం...
రాజ్యం గిరిగీతలో బంధీలైనం
మా శ్రమను జుర్రిన దళారీల
మోసంలో చితికిపోయినం...
అన్నం పెట్టిన మమ్ముల్ని అప్పుల్లోకి నెట్టి
మా ఆత్మలను హత్యలు
చేసిన దుర్మార్గపు రాజ్యం ఇది...
ఏలెటోడి రూపంలో దోసెటోన్ని చూసినం
కాలి కూలిపోయిన
కరుణించని కఠినాత్ములు...
మనోవేదన వద్దు
మారాలి మనమంతా
రైతన్నల దండుగట్టి
రగిలిద్దాం ఉద్యమాన్ని...
అణచాలనీ వాడు చూస్తే
కర్రను కత్తిగా చేద్దాం
ఆత్మహత్యలు వద్దు
పోరాడి సాదిద్దాం
చరిత్ర నిర్మాణంలో
వేగుచుక్కై వెలుగుదాం...!

❀ ❀ ❀



## సభ్యుల మనోగతం

### అభినందనలు

ఆంధ్రమహాసభ కార్యవర్గం చేస్తున్న యాక్టివిటీస్ తెలుసుకొని చాలా సంతోషించడమే కాకుండా తమ విలువైన సమయాన్ని, శక్తిని ఆంధ్రమహాసభ కోసం దారపోస్తున్న వారందరిని అభినందిస్తున్నాను. నాకు దర్పణం పత్రిక క్రమం తప్పకుండా వస్తోంది. అందుకు మీకు ధన్యవాదములు.

**- తోట సాంబశివరావ్**

### బాగుంది.

ఆంధ్రమహాసభలో జరుగుతున్న కార్యకలాపాల వివరాలను అందించడమే కాకుండా పూర్తిస్థాయి పత్రికలా మీరు మాకు దర్పణాన్ని అందిస్తున్నందుకు కార్యవర్గానికి, సంపాదక బృందానికి ధన్యవాదములు. పలురకాల కారణాల వల్ల మేం అప్పుడప్పుడు మహాసభ కార్యక్రమాలకు రాలేకపోయినప్పటికీ దర్పణం ద్వారా మాకు కళ్ళకు కట్టినట్లు చూపిస్తున్నందుకు మీకు అభినందనలు. దర్పణాన్ని ఇలాగే కొనసాగించాలనీ మనవి చేస్తున్నాం.

**- గుర్రం శ్రీనివాస్**

### కొత్తవారిని ప్రోత్సహిస్తున్నారు.

దర్పణం పత్రికలో మీరు కొత్త రచయితలను, కవులను ప్రోత్సహిస్తున్నందుకు మీకు కృతజ్ఞతలు. నాలాంటి అపరిచిత కవయిత్రి రాసిన కవితల్ని కూడా ప్రచురించి మీరు మాకు స్ఫూర్తిని కలిగిస్తున్నారు. మేం ఉండే చోట ఒక్క తెలుగు పత్రిక కూడా లభించదు. అసలు ముంబయిలో ఎక్కడ తెలుగు పత్రికలు దొరుకుతాయో కూడా మాకు తెలియదు. నేను ఆంధ్ర మహాసభ సభ్యురాలిని కాకపోయినా మాకు పరిచయం ఉన్న వారి ఇంటికి దర్పణం వస్తుంది. అది చదివి నేను దర్పణానికి అభిమానిని అయ్యాను. మీ అందరికి నమస్కారాలు.

**- విజయదుర్గ**

### శీర్షికలు పెంచండి

దర్పణం అంటే కేవలం ఆంధ్రమహాసభకు చెందిన వార్తపత్రిక అని మేం అనుకోవడం లేదు. ఎన్నోరకాల శీర్షికలు ప్రచురిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. కానీ, మహిళల కోసం, పిల్లల కోసం ప్రత్యేక శీర్షికలు పెట్టాలనీ కోరుతున్నాం.

**- నీరటి భూమన్న**

**జరిగిన కార్యక్రమాలు**

## మ్యాజిక్ షో మరియు చిత్రలేఖన పోటీలు

**తేది: 16.11.2015, సోమవారం**
**సా॥ 7.00 గంటలకు**





ముంబయిలోని తెలుగు ప్రజలకు, మహాసభ సభ్యులకు వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందిస్తూ తెలుగు భాషా, సాహితీ సంస్కృతుల పరిరక్షణకై పాటు పడుతున్న మహాసభలో సోమవారం, 16 నవంబర్ నాడు చిత్రలేఖన పోటీలు, మ్యాజిక్ షో నిర్వహించారు.

అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం సాయంత్రం పిల్లల కోసం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. తొలుత మహాసభ ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్ సభకు స్వాగతం పలికారు.

రెండు విభాగాల్లో ఈ పోటీలను నిర్వహించారు. మొదటి విభాగంలో ఒకటవ తరగతి నుండి అయిదవ తరగతి వరకు, రెండో విభాగంలో ఆరవ తరగతి నుండి పదవ తరగతి పిల్లల కోసం నిర్వహించిన ఈ పోటీలో 60 మంది పిల్లలో పాల్గొన్నారు. కాగా మొదటి విభాగంలో రుద్ర ప్రేరణ, తాటికొండ రాఘవ్, గాజుల సాహిల్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలవగా, గాజుల సుజల్, గుండారపు విఘ్నేశ్, కటుకం సాక్షి, గుండేటి జిష్ణు, మేక అఖిలలకు కన్సోలేషన్ బహుమతులు లభించాయి. రెండవ విభాగంలో ఆడెప్ రోషిణి, బిల్లా దుర్గ, బత్తుల శివాని మొదటి మూడు స్థానాలు గెలుచుకోగా, వాసాల వేదవ్రత్, యెర్ర రితిక, కటుకం సోని, జల్దా శృతి, అన్నల్‌దాసుల వాణిశ్రీ కన్సోలేషన్ బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు నగదు బహుమతితో పాటు సర్టిఫికేట్లను అందించారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారందరికీ యోగ్యతాపత్రాలను అందించారు. చిత్రలేఖన పోటీలకు ప్రముఖ చిత్రకారులు రాములు, బడుగు రమేశ్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

### ఆకట్టుకున్న మ్యాజిక్ షో

బాల సాహిత్యంలో కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత, ప్రముఖ మెజీషియన్ చొక్కాపు వెంకటరమణ ప్రదర్శించిన మ్యాజిక్ షో అందరినీ ఆకట్టుకుంది. సభికుల్ని, పిల్లల్ని వేదికపైకి రప్పించి వారితోనే మ్యాజిక్‌లు చేయించడం







అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా చొక్కాపు వెంకటరమణ మాట్లాడుతూ, 'మనుషుల్లో మార్పు తీసుకురావాలంటే మంచి మాటలు చెప్పాలనీ, ఆ మంచి మాటలను మ్యాజిక్‌తో జత చేసి చెబితే ఆ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుందని..' అన్నారు.

గౌరవ అతిథిగా విచ్చేసిన ప్రముఖ బాలసాహితీవేత్త, 'మొలక' బాలసాహిత్య పత్రిక నిర్వాహకులు, ప్రముఖ కవి తిరునగరి వేదాంతసూరి మాట్లాడుతూ, 'తెలుగు నేలకు దూరంగా ఉంటూ కూడా తెలుగువారి కోసం ఆంధ్రమహాసభ చేస్తున్న కృషి అభినందనీయమనీ, ఈసారి బాలల దినోత్సవాల్లో పాల్గొనే అవకాశాన్ని వదులుకున్నందుకు బాధపడుతున్న నాకు మహాసభలో బాలల దినోత్సవ సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందనీ...' అన్నారు.

వేదికపై ముఖ్యఅతిథిగా చొక్కాపు వెంకటరమణ, గౌరవ అతిథిగా బాలసాహిత్యవేత్త తిరునగరి వేదాంతసూరి, ధర్మకర్తల మండలి సభ్యులు మార్గం రాజ్‌పాల్, అధ్యక్షులు సంగం ఎక్‌నాథ్, ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్, సాహిత్య, క్రీడా విభాగ ఉపాధ్యక్షులు సంగెవేని రవీంద్ర, కోశాధికారి బడుగు విశ్వనాథ్ తదితరులు ఆసీనులయ్యారు. ఈ సందర్భంగా అతిథులతో పాటు చిత్రకారునిగా మహాసభకు ఎన్నో విధాలుగా సహకరిస్తున్న రాములు సార్‌ను, బడుగు రమేశ్‌గారిని ఘనంగా సన్మానించారు.

కార్యక్రమానికి వ్యాఖ్యాతగా సాహిత్య విభాగ ఉపాధ్యక్షులు సంగెవేని రవీంద్ర వ్యవహరించారు. కాగా చిత్రలేఖన పోటీలు విజయవంతం కావడానికి కార్యవర్గ సభ్యులు బోగా సదానంద్, బడుగు రమేశ్, మచ్చ సుజాత గార్లు ఎంతో సహకరించారు.



ఉత్సాహంగా సాగిన ఈ కార్యక్రమంలో పరిపాలనా శాఖ ఉపాధ్యక్షులు ద్యావరిశెట్టి గంగాధర్, సంయుక్త కార్యదర్శులు యెలిగేటి రాజ్‌కుమార్, పిట్ల బాలక్రిష్ణ, పీఆర్వో కటుకం గణేశ్, కార్యవర్గ సభ్యులు వాసాల గంగాధర్, పోన్న శ్రీనివాసులు, మహిళాశాఖ సభ్యురాలు ఇ.ప్రియంవద తదితరులు పాల్గొన్నారు.




**జరిగిన కార్యక్రమాలు**

## రాధస్వామి సత్సంగ్

**తేది: 18.11.2015 నుండి 22.11.2015**





ముంబయిలోని బాబా సోమ్‌నాథ్ మహారాజ్ ట్రస్ట్ తరపున ఆంధ్రమహాసభలో తేది 18 నవంబర్ నుండి 22 నవంబర్ వరకు బాబా రాధాస్వామి సత్సంగ్ సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దివ్యానుగ్రహభాషణము చేయుటకు నాగ్‌పూర్ నుండి బాబా రాంసింగ్ మహారాజ్ విచ్చేసారు.

ఈ సందర్భంగా ఆంధ్రమహాసభ ధర్మకర్తల మండలి చైర్మెన్ పోతు రాజారాం, ప్రధాన కార్యదర్శి యాపురం వేంకటేశ్వర్, పరిపాలనా శాఖ ఉపాధ్యక్షులు ధ్యావరిశెట్టి గంగాధర్ తదితరులు స్వామివారిని దర్శించుకొని ఆంధ్రమహాసభ తరపున పుష్పగుచ్ఛం సమర్పించి ఆశీస్సులు పొందారు.


ఆంధ్రమహాసభ జీవిత సభ్యులు, దాంతోపాటే యావత్ తెలుగు ప్రజలందరికీ మేలు కలగాలనీ స్వామివారు దీవించారు.

---

**జరిగిన కార్యక్రమాలు**

## కార్తీక దీపోత్సవం

**తేది: 30.11.2015 సోమవారం సా॥ 6.30 గంటలకు.**





ఆంధ్రమహాసభకు చెందిన మహిళాశాఖ అధ్వర్యంలో తేది 30.11.2015 రోజున సాయంత్రం 6.30 గం॥లకు సభాప్రాంగణంలో 'కార్తీక దీపోత్సవ'



కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించారు. కార్తీక మాసం అంటేనే వెలుగుల పండగ. ఇంటింటా దివ్వజ్యోతులు వెలిగించి మన జీవితాల్లో కూడా వెలుగులు నిండాలని కోరుకునే మాసం ఇది. అలాంటి పర్వమాసంలో నిర్వహించిన ఈ వేడుకలు తెలుగువారి సంప్రదాయానికి ప్రతీకగా నిలిచాయి.

అందంగా అలంకరించిన దీపజ్యోతుల మధ్య మన ఆడపడుచులు మహాలక్ష్మి స్వరూపులుగా అలంకరించుకొని ఎంతో చక్కటి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. మహిళలందరూ భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పాల్గొన్న మహిళలందరికీ అల్పాహారం అందించారు.

మహిళాశాఖ అధ్యక్షురాలు ఎమ్.మేఘమాల, కార్యదర్శి జి.బాలామణిగార్లతో పాటు మహిళాశాఖ కార్యవర్గం ఎంతో శ్రమించి నిర్వహించిన ఈ కార్యక్రమానికి విచ్చేసిన మహిళందరికీ ధన్యవాదములు తెలిపారు.

**జరిగిన కార్యక్రమాలు**

## అచార్య టి గౌరీశంకర్‌కు ఘనసన్మానం

**తేది: 06.12.2015**
**సా॥ 7.00 గం॥ లకు**



'మిగతా తెలుగేతర రాష్ట్రాలతో పోలిస్తే మహారాష్ట్ర నుండే ఉన్నతమైన తెలుగు సాహిత్యం వెలువడుతోందనీ, అయితే కవులతో పాటు కథకులు కూడా పెరిగినట్లయితే మహారాష్ట్రలోని తెలుగువారి సమగ్ర జీవన విధానం చరిత్రలో నిలిచిపోతుందనీ, అయితే సాహిత్యమెప్పుడూ సమకాలీన సమస్యలను ఎత్తిచూపాలనీ..' పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి. గౌరీశంకర్ అన్నారు.

ఆదివారం సాయంత్రం ఆంధ్రమహాసభ సభాప్రాంగణంలో జరిగిన సన్మాన సభలో ఆయన తెలుగు భాషా వికాసం, సాహితీ సంస్కృతుల పరిరక్షణ లాంటి పలు విషయాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర మానవ వనరుల శాఖ నిర్వహించే పలు సాహిత్య ప్రోత్సాహకాలను రచయితలు అనుసరించాలనీ, వివిధ పత్రికలకు రచనలు పంపాలనీ, అప్పుడే తగిన గుర్తింపు వస్తుందనీ అన్నారు. 'సాహిత్యాన్ని ఎవరైనా ప్రోత్సహించవచ్చు కానీ బీజాల్లో సత్తా ఉండాలనీ, అప్పుడే సాహితీవేత్తలు వెలుగులోకి వస్తారనీ, బీజాక్షరాల్లో శక్తి లేకుంటే ఎంత ప్రోత్సహించినా ప్రయోజనం ఏమీ ఉండదని..' అన్నారు. ఆంధ్రమహాసభ వివిధ రంగాల్లో చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు.

తొలుత ప్రధాన కార్యదర్శి సభకు స్వాగతం పలికారు. సాహిత్య విభాగ ఉపాధ్యక్షులు సంగెవేని రవీంద్ర ఆచార్య టి.గౌరీశంకర్ గురించి పరిచయం చేశారు. పరిచయ కార్యక్రమానంతరం అధ్యక్షులు సంగం ఏక్‌నాథ్, ధర్మకర్తల మండలి చైర్మెన్ పోతు రాజారాం మహాసభ తరపున గౌరీశంకర్‌గారిని ఘనంగా సన్మానించారు. అధ్యక్షులు సంగం ఏక్‌నాథ్ మాట్లాడుతూ, 'ఆచార్య టి. గౌరీశంకర్ గారు నిజానికి ఏదో ఒక విశ్వవిద్యాలయానికి ఉపకులపతి కావాల్సిన స్థాయి ఉన్నవారనీ, ముంబయిలోని తెలుగు సంఘాలు ఆ దిశగా తెలంగాణ ప్రభుత్వానికి లేఖలు రాయాలని..' పిలుపునిచ్చారు.

ధర్మకర్తల మండలి చైర్మెన్ పోతు రాజారాం మాట్లాడుతూ, 'ఆచార్య టి. గౌరీశంకర్‌గారికి ముంబయి తెలుగు సంఘాలతో 30 సంవత్సరాల అనుబంధం ఉందనీ, ఆయన హయాంలోనే ఆంధ్రమహాసభ, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారనీ, నేటి ముంబయి కవులకు ఆయన స్ఫూర్తి ప్రదాత..' అని పేర్కొన్నారు.

ఇదే కార్యక్రమంలో హైదరాబాద్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న యువ పోలీస్ అధికారి బోగా నరహరి గారిని, వారి బృందాన్ని కూడా ఆంధ్రమహాసభ తరపున సన్మానించారు. ఈ కార్యక్రమానికి సుదూర ప్రాంతమైన వాషి నుండి ప్రత్యేకంగా విచ్చేసిన తెలుగు కళాసమితి సంయుక్త కార్యదర్శి మంజుల గారిని కూడా ఆత్మీయంగా సన్మానించారు.



ఈ కార్యక్రమంలో పరిపాలనా శాఖ ఉపాధ్యక్షులు ధ్యావరిశెట్టి గంగాధర్, సాహిత్య విభాగ ఉపాధ్యక్షులు సంగెవేని రవీంద్ర, కోశాధికారి బడుగు విశ్వనాథ్, సంయుక్త కార్యదర్శి పిట్ల బాలక్రిష్ణ, పీఆర్వో కటుకం గణేశ్, సభ్యులు బోగ సదానంద్, కళ్యాణపు రవీందర్ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు ఆంధ్రమహాసభలో పలు పదవులనధిరోహించి ఎన్నో సేవలందించిన కొత్తపల్లి రమేశ్‌బాబు గారు, తెలుగు కళా సమితి పూర్వ అధ్యక్షులు వల్లభరావు గారు, వివేక గ్రంథాలయ పూర్వ అధ్యక్షులు తలకొక్కుల గంగాధర్, కవి నడిమెట్ల యెల్లప్ప తదితరులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**జరిగిన కార్యక్రమాలు**

**నా పాట పంచామృతం**

**తేది: 12.12.2015**

**శనివారము, సా॥ 6.30 గం॥**





శనివారం సాయంత్రం ఆంధ్రమహాసభలో నిర్వహించిన మనీషా కల్చరల్ ఆర్గనైజేషన్ (హైదరాబాద్) వారి 'నా పాట పంచామృతం' సభికుల్ని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర ప్రభుత్వ వైద్య విభాగంలో ఉన్నతాధికారిగా సేవలందిస్తున్న డా॥ ఎస్.సుధాకర్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు.

తొలుత మహాసభ ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్ సభకు స్వాగతం పలికారు. ముఖ్యఅతిథితో పాటు ధర్మకర్తల మండలి చైర్మెన్ పోతు రాజారాం, ఉపాధ్యక్షులు ద్యావరిశెట్టి గంగాధర్, సంగెవేని రవీంద్ర, వేముల మనోహర్, కోశాధికారి బదుగు విశ్వనాథ్ తదితరుల చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన జరిగింది.

తదుపరి గాయకుడు మధుబాపు పాడిన **'వాతాపి గణపతి'** శ్లోకం తో సంగీత కచేరీ కార్యక్రమం ప్రారంభం అయింది. **ఓంకార నాదాలు సంధానమౌ గానమే శంకరాభరణమూ, జగదానంద తారకా జయ జానకీ ప్రాణనాయకా, ఏ శ్వాసలో చేరి గాలి గాంధర్వమవుతున్నదో, సిరిమల్లె పువ్వా సిరిమల్లె పువ్వా, హిమగిరి సొగసులు, పచ్చబొట్టేసినా పిల్లగాడ నీతో..., ఊహలు గుసగుసలాడే మన హృదయము ఊయలలూగే, శివశంకరీ శివానందల హరి.., నా పాట పంచామృతం...** లాంటి పాటలు సభికులను రంజింపచేశాయి.

గాయకులు మధుబాపు శాస్త్రి, అనురాధ, కీర్తి, మారుతి తదితరులు పాడిన ఈ పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. మధ్యమధ్యలో చిన్నారులు చేసిన నృత్యాలు కూడా అందరినీ అలరించాయి.

ఈ సందర్భంగా ముఖ్యఅతిథి **డా॥ ఎస్. సుధాకర్**గారిని, కళాకారులను మహాసభ తరపున ఘనంగా సన్మానించారు. ధర్మకర్తల మండలి చైర్మెన్ పోతు రాజారాం మాట్లాడుతూ, **'సాహితీ, సంస్కృతి, కళల వికాసానికి ఆంధ్రమహాసభ కట్టుబడి ఉందనీ, అంతేగాక, విద్య, వైద్య రంగాల్లో కూడా విశేషంగా కృషి చేస్తోందనీ, ఈ సాంప్రదాయాన్ని మున్ముందు కూడా కొనసాగిస్తూ సభికుల కోసం నాణ్యమైన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రయత్నిస్తామనీ...'** అన్నారు.





ముఖ్యఅతిథి డా॥ ఎస్. సుధాకర్ మాట్లాడుతూ, **'ఒక తెలుగు సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొనడం ఇదే మొదటిసారనీ, అందుకు నాకు చాలా సంతోషంగా ఉందనీ, పరాయి రాష్ట్రంలో ఉన్న తెలుగువారంతా ఇలాంటి కార్యక్రమాల్లో కలుసుకునేందుకు అవకాశం ఉంటుందనీ, దాంతో ఐక్యత ఏర్పడుతుందనీ, మహాసభ నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయంగా ఉంటున్నాయనీ...'** కొనియాడారు.

విచ్చేసిన అతిథులకు, ఆహ్వానితులకు అల్పాహారం, టీ,కాఫీలు అందించారు. నగరం నలుమూలల నుండి ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు రావడం విశేషంగా చెప్పుకోవాలి. ఈ మధ్యకాలంలో మహాసభ నిర్వహించిన కార్యక్రమాల్లో ఇంత భారీ సంఖ్యలో జనం రావడం ఇదే మొదటిసారి.

ఈ కార్యక్రమంలో మహాసభ అధ్యక్షులు సంగం ఏక్‌నాథ్, ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్, ధర్మకర్తల మండలి చైర్మెన్ పోతు రాజారాం, సభ్యులు మార్గం రాజ్‌పాల్, రాజగిరి అశోక్, నీల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు ద్యావరిశెట్టి గంగాధర్, వేముల మనోహర్, సంగెవేని రవీంద్ర, కోశాధికారి బడుగు విశ్వనాథ్, సంయుక్త కార్యదర్శులు పిట్ల బాలక్రిష్ణ, యెలిగేటి రాజ్‌కుమార్, ఏవీ నాగేశ్వరరావు, పీఆర్వో కటుకం గణేశ్, కార్యవర్గ సభ్యులు మచ్చ సుజాత, గంజి గోవర్ధన్, దంతాల పురుషోత్తం, బొమ్మకంటి కైలాష్, కస్తూరి హరిప్రసాద్, చిల్వేరి గోవర్ధన్, బోగా సదానంద్, వాసాల గంగాధర్, కళ్యాణపు రవీందర్, పొన్న శ్రీనివాసులుతో పాటు స్థానిక తెలుగువారు భారీ సంఖ్యలో హాజరయ్యారు.



## నేటి జీవితం

**- అవదూత సుమంజుల**

అపార్టుమెంట్‌ల రూపంలో
డిపార్ట్ అయిన జీవితాల్లో
అనుబంధం ఆత్మీయత
అంతరించి పోయే నేడు...

అమ్మ అనే పిలుపులోని
తీయనైన కమ్మదనం
కనుమరుగాయే నేడు
మమ్మీ అను మాటలోన...

పిజ్జా బర్గర్‌లంటూ
పికప్ పాయింట్ మోజులోన
అమ్మ చేతి గోరుముద్ద
గొంతులోన అడ్డుపడే...

స్లీవ్‌లెస్ టాప్‌లొచ్చే
లోవెస్ట్ జీన్స్‌వచ్చే
మోడ్రన్ ఫ్యాషన్‌ల మధ్య
మన సంస్కృతి నలిగిపోయే...

ఆన్‌లైన్‌లో పెళ్ళిల్లాయే
కంప్యూటరైజ్డ్ పిల్లలాయే
కాన్వెంట్ చదవులాయే
కన్నప్రేమ తెలియదాయే

గ్లోబలైజ్డ్ వెస్ట్రనైజ్డ్ కంప్యూటరైజ్డ్ లోకంలో
బంధమేమో బరువాయే
కడుపుతీపి కరువాయే
పైసలేమో ప్రాణమాయే
మమతలేమో మాయమాయే...!!



## Gangadhar Pillamarapu

CM Club, MDRT(USA), & Empowered Agent

**Mob: 9004039150 / 9322218929**

Email - pginvestus@yahoo.com Tel.: 022-24913408

PG INVESTMENT SHOP

# I Can Help You !

☑ **Select your long time pending issues**

- ☐ Your Insurance policy Lapsed/ Surrender/ Maturity/Loan/ any Corrections
- ☐ Any Mediclaim issues Cashless/ Reimbursement/ Portability
- ☐ Insurance for Two & Four Wheelers
- ☐ Looking for New Passport or Renewal for Assistance
- ☐ Income Tax Filing Returns Employee/ Business
- ☐ New Pancard or Correction in Pan details etc.,
- ☐ Mutual Fund Redumption/ New Investment
- ☐ Any other requirement : Insurance, Investments & Tax related

*Offering Insurance & Investment Solutions*

| | | | |
|---|---|---|---|
| Two & Four Wheeler | STAR | HDFC DEPOSITS | LIC Jeevan Rakshak |
| Insurance Cover | Take Care of Your Family Health | Safe, Secured, High Interest | Aam Aadhami Policy |
| LIC Jeevan Anand | SHRIRAM CHITS EMPOWERING PEOPLE THROUGH PROSPERITY | PASSPORT | Mutual Funds A Better way of Investment |
| Jindagi Ke Saath Bhi, Jindagi Ke Baad Bhi.. | Chit Funds FD, Business Loans Life Insurance | New & Renewal Passport Assistance | Mutual Funds SIP & Lumpsum |

Advt

# భలే భక్తి

- కట్టరాజు ఊషన్న

వాహ్‌వా ... ఏం భక్తి
ఉడత ఉన్మాద భక్తి
అసలును కాదనీ
కొసరు కొరకే కోరే భక్తి
ఉన్నత ఉద్ధండులను
ఉత్తది చేసి మాకు మించిన
భక్తులు లేరని చేసే ప్రసార శక్తి
తెలివికి వారసులం మేమని
మిగతా వారంతా గాలి బుడగలని
విద్యార్థి మేధావులను
కవులు గాయకులు
సాహితీవేత్తలు పౌరహక్కుల నేతలు
మేం చెప్పిందే పాటించాలి
మేం పాడమన్నదే పాడితీరాలి
మేం మూఢ భక్తులం ముగ్ధ భక్తులం
తినమని చెప్పింది తినాలి
వద్దన్నది వాడక వదిలెయ్యాలి
మత్స్యావతారం ఎందుకెత్తాడో మాకైతె తెల్వది
కానీ మీరు మాత్రం చేపలు తినొద్దు
వరహావతారం ఎందుకెత్తాడో మాకైతె తెల్వది
కానీ, మీరు మాత్రం పందిని మాత్రం తినొద్దు
మావాడు మాకు చెప్పాడో లేదో
మాకే తెల్వది కానీ
మేం మాత్రం మీకు చెప్తున్నాం
మేం చెప్పిందే వినాలి
మేం రాసిందే చదవాలి
మేం అన్నదే తినాలి
అంతా మేమే రాసేస్తాం..
అంతా మా ఇష్టం..
కాదు కూడదంటే
పరిణామాలు
మాకు తెల్వది...!!



# ఒకే తీరం

- మచ్చ ప్రభాకర్

క్షాలికుప్పకూలి బూడిదైన
స్వప్నాల చెరసాల నుంచి
ఉక్కు సంకెళ్ళు తెంచుకొని
భూమ్యాకాశాల మధ్య
ఉరి తీయబడ్డ రహస్యాల
ఊపిరిలోంచి ఉబికొచ్చి
చిన్న నిప్పు రవ్వ
దావానంలాగా మారితే పుట్టినోళ్ళం...
అరేబియా తీరాలంచున నిలబడి
కంటి పరదాల వెనక దాగిన
జల్లెడ పట్టిన జీవితాన్ని ముద్దాడి
'అక్షర యజ్ఞం' 'వలసపత్రం' 'నడక'
'జైత్రయాత్ర' నదిలో ఉప్పొంగి
సంచలనంగా ప్రవహించి
ఉప్పు జనసంద్రాన కరిగినోళ్ళం...
రోడ్డుపై మనిషి చూపు
ఈడ్చి గుంజి లాగుతుంటే
కాలం కడుపులో భద్రంగా
దాచుకున్న మూలతెలుగు
చరిత్ర కథలు నానీలు
ముత్యాల ముగ్గులై, 'నిప్పుల కెరటమై'
మూడో కన్ను తెరిచి ఎగిసిపడ్డోళ్ళం ...
మాకు కులమతాల
అంధవిశ్వాసాల గోడలు లేవు
గోడలు పగలగొట్టడమే మా దారి
మాకు విభజించి పాలించే
'సంకు'చిత స్వభావాల గుణాలే లేవు
చిగురించే కొమ్మల
సమిష్టి రక్షణే
మా చిరకాలం
వాంఛ... లక్ష్యం...!!



కథ

# యథా పెద్దలు తథా పిన్నలు

- తోట సాంబశివరావ్,
098667 78855

ఆదివారం.

ఉదయం వరండాలోని వాలు కుర్చీలో కూర్చుని న్యూస్ పేపర్ చదువుకుంటున్నాను. అంతలో నలుగురు చిన్నపిల్లలు అక్కడికి చేరుకొని ఆటలాడడం మొదలుపెట్టారు. అందులో ఇద్దరు మాకు కుడిప్రక్క పోర్షన్‌లో అద్దెకుంటున్న వాళ్ళ పిల్లలు. అబ్బాయికి పదేళ్ళు, అమ్మాయికి ఎనిమిదేళ్ళుంటాయి. మిగతా ఇద్దరూ మాకు ఎడమ ప్రక్క పోర్షన్‌లో అద్దెకుంటున్న వాళ్ళ పిల్లలు. అబ్బాయికి పదేళ్ళు, అమ్మాయికి ఎనిమిదేళ్ళుంటాయి. ఈ నలుగురు కలసి సందడి చేస్తుంటే చూడాలనిపించింది. పేపర్ ప్రక్కన పెట్టి వాళ్ళనే గమనిస్తున్నాను.

వాళ్ళు నలుగురూ కూడబలుక్కుని అమ్మా నాన్నల ఆట ఆడుకుందామనీ నిర్ణయించుకున్నారు. వాళ్ళ ఉద్దేశ్యంలో అమ్మా నాన్నలంటే వాస్తవంగా భార్యభర్తలన్నమాట. కుడిప్రక్క పోర్షన్‌లో ఉండే వాళ్ళ పిల్లలు అమ్మానాన్నలుగా ఒక జంట, ఎడమ ప్రక్క పోర్షన్‌లో ఉండే వాళ్ళ పిల్లలు అమ్మానాన్నలుగా ఒక జంట.

మొదటి జంట ఆడుతుంటే రెండో జంట చూస్తుంటుంది. రెండో జంట ఆడుతుంటే మొదటి జంట చూస్తుంటుంది. చివరిగా ఏ జంట బాగా ఆడితే ఆ జంట గెలిచినట్టు.

ఆట మొదలైంది.

మొదటి జంట ఆడుతుంటే రెండో జంట చూస్తోంది.

అమ్మాయి (అమ్మ) ఇంట్లో వుండి, అబ్బాయి (నాన్న) కోసం ఎదురు చూస్తుంటుంది. నాన్న బాగా ఆలసిపోయి నీరసంగా ఇంటికి వస్తాడు. అమ్మ ఎదురెళ్ళి 'ఏంటండీ...! అలా వున్నారు..? ఇంత ఆలస్యం అయిందేమిటి...?' అని అడుగుతుంది.

'ఏం లేదు.... ఈ రోజు ఆఫీసులో పని చాలా ఎక్కువగా వుంది..' అని చెప్తాడు.

'ఔనా..? సరే ముందు ఈ మంచి నీళ్ళు త్రాగండి. కాసేపట్లో కాఫీ చేసి తెస్తాను...' అంటూ మంచి నీళ్ళ గ్లాసు ఇచ్చి లోపలికెళ్తూ..., 'అన్నట్లు పొద్దున మీరు వెళ్ళేటప్పుడు పిల్లల కోసం చాక్లెట్లు తెమ్మన్నాను. తెచ్చారా...?' అని అడిగింది.



'లేదు.. తేలేదు.. ఆఫీసు పని ఒత్తిడిలో మరిచిపోయాను...' అని చెప్తాడు.

'సర్లెండి.. రేపు తెద్దురు గాని...' అంటూ లోపలికి వెళ్తుంది. కాసేపట్లో కాఫీ కప్పుతో తిరిగి వస్తుంది.

'ఇదిగోండి... కాఫీ తాగండి...' అని కాఫీ కప్పు అందిస్తుంది.

'థ్యాంక్స్..!' అంటాడు...

నాకు చాలా ఆశ్చర్యం వేసింది. వాళ్ళిద్దరి సంభాషణ, హావభావాలు, ఎంతో సహజంగా వున్నాయి. బహుశా ఇలాంటి దృశ్యాలు వాళ్లింట్లో తరచుగా చూస్తుంటారేమో... చాలా అనుభవం వున్న వాళ్ళలాగా ఆటను రక్తికట్టించారు.

ఇంతలో రెండో జంట, 'మీ ఆట బాగా లేదు..' అని మొదటి జంటతో చెప్తారు.

'మా ఇంట్లో మా అమ్మా నాన్నలు ఇలాగే వుంటారు. అందుకే అలా ఆడాము. అయితే ఇప్పుడు మీరు ఆడండి..' అని మొదటి జంట చెపుతుంది.

రెండో జంట ఆట మొదలైంది. రెండో జంట ఆడుతుంటే మొదటి జంట చూస్తుంది.

అమ్మాయి (అమ్మ) ఇంట్లో వుండి అబ్బాయి (నాన్న) కోసం ఎదురుచూస్తుంటుంది. నాన్న బాగా అలసిపోయి నీరసంగా ఇంటికి వస్తాడు. అమ్మ ఎదురెళ్ళి, 'ఆ..! ఏంటి...? ఈ రోజు కూడా పార్టీయేనా...? ఇంతలేటయింది...?' అని అడుగుతుంది.

'ఆ..! పార్టీ లేదు.. ఏమీ లేదు... ఆఫీసులో లేటయిందిలే...!' అంటూ లోపలికెళ్తూ, 'అన్నట్లు నేను పొద్దున వెళ్ళేప్పుడు రాత్రికి చికెన్ కూర వండమన్నాను.. వండావా...?' అని అడుగుతాడు.

'ఓపిక లేక వండలేదులే... రేపు వండుతాలే....' అంటుంది.

'ఓపిక లేక కాదే...! నీకు ఒళ్ళు బాగా బలిసింది. మొగుడి మాటంటే లెక్కలేకుండా పోయింది...' అంటూ గొణుక్కుంటాడు.

'ఏంటి...? నోరు పారేసుకుంటున్నావ్...! నీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఇక్కడ పడివుండే వాళ్ళు ఎవరూ లేరు..' అంటుంది.

'ఏంటే... ఎదురు మాట్లాడుతున్నావ్...? పళ్ళు రాలగొడుతా...' అంటూ మీదికి వెళ్తాడు.

'ఏది రాలగొట్టు చూద్దాం...?'

'ఏంటే.. నిన్ను.... నిన్ను...'

'ఆ... ఏంటి.. ఏంటంటా...?

ఇద్దరూ పెద్దగా అరుచుకుంటూ, పోట్లాడుకుంటారు.

ఓహ్...! ఎంతో అద్భుతంగా ఆడారు. ఎంతో అనుభవం ఉన్న వాళ్ళలాగా ఆడారు. బహుశ.., ఇలాంటి దృశ్యాలు వాళ్ళింట్లో తరుచుగా చూస్తుంటారేమో...!

ఇంతలో మొదటిజంట 'మీ ఆట బాగాలేదు...' అని రెండో జంటతో చెప్తారు.

'మా ఇంట్లో మా అమ్మానాన్నలు ఇలాగే ఉంటారు. అందుకే అలా ఆడాము..' అని చెప్తారు రెండో జంట.

రెండు ఆటలు చూసిన తర్వాత నాకో విషయం అర్థం అయింది. ఆ పిల్లల తల్లిదండ్రులు ఇంట్లో ఎలా ఉంటారో పిల్లలు చూశారు. ఆ సన్నివేశాలే వారి మనస్సుల్లో ముద్రించబడ్డాయి. పెద్దవాళ్ళు ఎలా ప్రవర్తిస్తారో.. చిన్నవాళ్ళు గమనించి, తాము కూడా వయసు పెరిగిన తర్వాత అలాగే ప్రవర్తిస్తారు. అదే సరైన పద్ధతి అనుకుంటారు. ఎందుకంటే వారి తల్లిదండ్రుల పద్ధతే సరైనదనే వాళ్ళ నమ్మకం.

పిల్లలు పెద్దవాళ్ళయిన తరువాత మంచి పౌరులుగా ఎదగాలంటే..ముందుగా తల్లిదండ్రులు మంచి పౌరులై ఉండాలి మంచి అలవాట్లు, సంస్కారం, సత్ప్రవర్తన, పెద్దల యెడ గౌరవం... ముందు పెద్దలకు ఉంటే అవే పిల్లలకు వస్తాయి.

మగమనిషి ఇంట్లోనే సారా త్రాగుతూ, ఇంట్లోనే స్నేహితులతో పేకాట ఆడుతూ, సిగరెట్ తాగుతూ, తన కుమారుడు మాత్రం సారా త్రాగకూడదు, పేకాల ఆడకూడదు, సిగరెట్టు తాగకూడదు అనుకుంటే అది జరగని పని.

ఆ అబ్బాయి అప్పటికే తండ్రి చేస్తుంటే చూస్తున్నాడు. అతడూ అదేవిధంగా తయారవుతాడు. ఆడమనిషి గయ్యాళితనంతో భర్తను రాచి రంపాన పెడుతూ, తన కూతురు మాత్రం మంచి ఇల్లాలిగా ఎదగాలనీ, ఆమె కాపురం అన్యోన్యంగా సాగాలనీ అనుకుంటే అది జరగని పని. ఆ అమ్మాయి అప్పటికే తల్లి చేసే గొడవలు చూస్తుంది. ఆ అమ్మాయి కూడా తల్లిలాగే తయారవుతుంది.

సాధారణంగా పిల్లలను తెల్లవారు ఝామున నిద్రలేపి, చదువుకోమని చెప్పి మనం ఏడెనిమిది దాకా నిద్రపోతూవుంటే, వాళ్ళూ తెల్లారి ఝామున లేచినా మరల వెంటనే నిద్రపోతారు. అందుకే భార్యాభర్తల్లో ఎవరో ఒకరు పిల్లల కోసం పిల్లలతో పాటే మేలుకుని వుండాలి.

మా పిల్లలు చిన్నప్పుడు ... తెల్లవారు ఝామునే లేచి చదువుకోమంటే లేచి చదివే కారు కాదు. అప్పుడే నేను కొన్ని డిపార్టుమెంటు పరీక్షలు వ్రాయాలనుకున్నాను. తెల్లవారు ఝామునే లేచి చదవడం మొదలుపెట్టాను. నాతోపాటే మా పిల్లలు లేచి చదువుకోవడం మొదలుపెట్టారు.

అందువల్ల మా పిల్లలు బాగా చదువుకొని మంచి మార్కులతో పాసయ్యారు. తరువాత తరువాత... తెల్లవారు ఝామున లేచి చదువుకోవడం వాళ్ళకు ఒక అలవాటుగా మారింది. ఆఫ్‌కోర్స్...! నేను డిపార్టుమెంట్ పరీక్షలన్నీ పాసయ్యాను. తద్వారా ఇంక్రిమెంట్లు వచ్చాయ్... ప్రమోషన్స్ వచ్చాయి...

ఇవన్నీ ఆలోచిస్తుంటే ... నాకనిపిస్తుంది... 'చిల్డ్రన్ విల్ నాట్ ఫాలో ఇన్‌స్ట్రక్షన్స్ బట్ దే విల్ ఫాలో యాక్షన్స్...'

పెద్దవాళ్ళు ఎలా చేస్తే పిల్లలు కూడా దాదాపు అలాగే చేస్తారు.

కాబట్టి పెద్దలూ... తస్మాత్ జాగ్రత్త...! మన పిల్లలు భవిష్యత్తులో ఆదర్శపౌరులుగా ఎదగాలనుకోవడం అత్యాశ కాదు కదా...! అయితే ఇప్పటి నుంచే మనం జాగ్రత్త పడదాం. ముందు మనం ఆదర్శవంతంగా జీవిద్దాం... మన పిల్లలూ ఆదర్శవంతంగా పెరుగుతారు. బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతూ మనకు, మన కుటుంబాలకు ఎనలేని కీర్తి ప్రతిష్టలు తెస్తారు. మనవంతు కర్తవ్యంగా భావి భారత అభివృద్ధికి పాటుపడడానికి... మంచిపౌరులను అందిద్దాం...!!

## మీకు తెలుసు కదా..!

**మ**హాసభ అంటే కేవలం మనోరంజక కార్యక్రమాలు, కాలక్షేపాలే కావనీ, తెలుగు సాహితీ సంస్కృతులు పరిరక్షణ కేంద్రమనీ, తెలుగు ఐక్యతకు ప్రతీక అని **మీకు తెలుసు కదా..!** అంతేకాదండీ..! ఇంకా ఉన్నాయి..

### మీ భక్తి ప్రవృత్తుల కోసం..



**మ**హాసభ ప్రాంగణంలోనే శ్రీ వెంకటేశ్వర దేవాలయం ఉంది. నిత్యపూజలతో కళకళలాడే ఆ స్వామివారిని దర్శించుకుంటే ఏ ఆపదలు రావనీ, ఆపదమొక్కుల వాడి ఆశీస్సులు అందరికీ అందుతాయనీ **మీకు తెలుసు కదా..!** అయితే ఇంకేం..? రండి..! సకుటుంబ సపరివారంగా మహాసభలో కొలువై ఉన్న ఏడుకొండలవాడిని దర్శించుకుని పాపపరిహారం పొందడమే కాకుండా మోక్షమార్గాన్ని సులభతరం చేసుకొండి..!

### మీ ఆరోగ్యం కోసం..



**'ఆరోగ్యమే మహాభాగ్యం'** అన్నారు పెద్దలు..మరి ఆరోగ్యం బాగుండాలంటే దేహం చురుకుగా ఉండాలి. దేహం ఆరోగ్యవంతంగా ఉంటే ఆలోచనలు నాణ్యంగా ఉంటాయి. మంచి ఆలోచనల కోసం, గొప్ప జీవితం కోసం దేహారోగ్యం ఎంతో అవసరం. దేహారోగ్యం కోసం మహాసభలో ఉచిత యోగా క్లాసెస్‌తో పాటు జింఖానాలో వ్యాయామ పరికరాలెన్నో ఉన్నాయి. ప్రతి ఉదయం మీరు జింఖానాకు వచ్చి వ్యాయామం చేసి మీ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఆటలు ఆడుకోవచ్చు.. ఆనందం పంచుకోవచ్చు.. ఇవన్నీ **మీకు తెలుసు కదా..!**

### మీ విజ్ఞానం కోసం..



**పుస్తకం హస్త భూషణం** అన్నారు కదండీ..! అంతేకాదు.. పుస్తకాలు లేని ఇల్లు స్మశానంతో సమానమని కూడా అన్నారు. పుస్తకం మనిషి మస్తిష్కానికి ఎరువులాంటిది. అలాంటి విజ్ఞానజ్యోతుల్ని వెలిగించి పెంచే దాదాపు 8 వేల అమూల్యమైన గ్రంథాలెన్నో ఆంధ్రమహాసభలోని శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గ్రంథాలయంలో మీ కోసం ఎదురుచూస్తున్నాయనీ **మీకు తెలుసు కదా..!**

### మీ సంస్కృతి కోసం..



**క**ళలు మన సంస్కృతికి తాళపు చెవులు. కళలు ఒక జాతికి దృవీకరణ పత్రాలు. నాట్యం, గానం, సంగీతం, సాహిత్యం అన్నీ కూడా మనిషిలోని చీకటి తెరల్ని తొలగించి, వెలుగు కిరణాలకు స్వాగతం పలికే దీపదారులు. మహాసభలో వివిధ నాట్య రీతుల్ని నేర్పించే తరగతులు నిర్వహిస్తున్న విషయం **మీకు తెలుసు కదా..!**

**వీటితోపాటు ప్రతి నెలా విజ్ఞానపరం, వినోద, ధార్మిక కార్యక్రమాలు, ఆరోగ్యశిబిరాలు, కౌన్సిలింగ్ ప్రోగ్రాములు రెగ్యులర్‌గా జరుగుతాయి. దర్పణంలో కార్యక్రమాల వివరాలు తెలుసుకొండి.. రండి..! ఆంధ్రమహాసభ మనది.. మనందరిది..! కార్యక్రమాల్ని విజయవంతం చేద్దాం..! మన స్వాభిమానాన్ని పెంచుకొందాం..!! ఇది మీకు తెలుసు కదా...!!**

# గతి తార్కిక భౌతికవాద రచయిత

- సంగెవేని రవీంద్ర

**మా** సుబ్బిగాడిదంతా ఆదోరకం తత్వం. 'అసలు వాడికి తత్వమే లేదంటాడు..' మా ప్రకాశ్‌గాడు. సుబ్బిగాడికి సంతోషం వేసినా, దు:ఖం పొంగుకొచ్చినా వాడో విధమైన ట్రాన్స్‌లోకి వెళ్ళిపోతాడు. ఆ ట్రాన్స్‌లో వాడూ, నేనూ, ప్రకాశ్‌గాడు, ఇంకో ఎవడో కోన్‌కిస్కాగాడు మాత్రమే ఉంటాం. అది కూడా ఓ బార్‌లో ఉంటాం. ఆ రోజు బిల్లంతా వాడిదే. అంటే వాడు ట్రాన్స్‌లోకి పోయిన మహత్యం అన్నమాట. ఏమైందో తెలియదు కానీ నిన్న రాత్రి పీకల్దాకా తాగాడు.. మాకు తాగించాడు. మేం అంతే..! ఫ్రీగా వస్తే ఫినాయిల్ కూడా తాగేస్తాం. అలాంటప్పుడు వాడు విదేశీ విస్కీ తాగిస్తానంటే వద్దనే వైరాగ్యం మాకు ఇంకా రాలేదు. రాకూడదనే కోరుకుంటున్నాం.

అందుమూలంగా జరిగిందేమంటే ఉదయం లేవబుద్ది కాలేదు. కానీ ఏవో బ్యాండ్ మేళాల చప్పుడు కర్ణభేరీలను ఖండిస్తుంటే లేవక తప్పలేదు. ఏవో జిందాబాద్, ముర్దాబాద్‌లు కూడా వినొస్తున్నాయి. 'ఎవడీ చచ్చిన సన్నాసీ.. చచ్చిన వెధవ చచ్చిచావక నన్ను నిద్రపోన్వికుండా ఎందుకు చంపుతున్నాడు సచ్చినోడు..' అని తిట్టుకుంటూ గడియారంపై చూపు విసిరాను. 11 అవుతోంది. సర్లే అనుకుంటూ బలవంతంగా లేచి బాల్కనీలోకి వచ్చి వీధిలోకి తొంగి చూశాను.

దాదాపు వంద మందిదాకా ఉన్నారు వాళ్ళు. చేతిలో ఏవో ప్లకార్డులు పట్టుకొని పిడికిలి బిగించి గాల్లో వూపుతూ వాళ్ళు కూడా ఆవేశంతో ఊగిపోతున్నారు. 'చేతిలో ప్లకార్డులు పట్టుకున్నవాళ్ళు మళ్ళీ పిడికిలి బిగించి గాల్లో ఎలా వూపుతారు...' అనే బోడిగుండు సందేహం మీకు వస్తుందని నాకు ముందే తెలుసు. అర్థం చేసుకోవాలి.. అన్ని పూసగుచ్చినట్లు చెప్పేందుకు ఇక్కడ తీరి తందనానా ఆడేవాడు ఎవడూ లేడు. కొందరు ప్లకార్డులు పట్టుకుంటే మరికొందరు పిడికిలి బిగించారు అని అర్థం..! సమజైందా..?

దగ్గరకు రాగానే ఆ ర్యాలీకి కారణమైన శాల్తీని గుర్తుపట్టాను. అతడు మా వీధిలోనే ఉండే ఓ గతితార్కిక భౌతికవాద రచయిత. 'అభ్యుదయ రచయిత, ప్రగతిశీల రచయిత, కులగజ్జీ రచయిత, కులీన రచయిత, హిందూ రచయిత, ముసల్మాన్ రచయిత, ఆరెస్సెస్ రచయిత, ఎమ్ఐఎమ్ రచయిత... ఇలా రకరకాల రచయితల పేర్లు విన్నాం కానీ, ఈ గతితార్కిక భౌతిక వాద రచయిత అంటే మేం ఎప్పుడూ వినలేదే..?!' అనే సగం కాలిన శవం లాంటి మరో సందేహం మీకు వస్తుందని నాక్కూడా తెలుసు.



నేను చెబితే బాగుండదు కానీ మీకు వీలున్నప్పుడు వచ్చి కలవండి.. అప్పుడు తెలుస్తుంది అసలర్థం ఏమిటో..? ఉదాహరణకు మీరొచ్చి 'ఏవండీ...! దేశంలో గోహత్యను నిషేదించారట.. దీనిపై మీ అభిప్రాయం ఏమిటండీ..?' అని ఎంతో గౌరవంగా, సవినయంగా అడిగారనుకొండి. అప్పుడు ఆ గతాభౌవా (అంటే గతితార్కిక భౌతికవాద అన్నమాట...) రచయిత తన చేతుల్ని బారుగా చాచి, కళ్ళను రకరకాలుగా తిప్పి, తలను ఏ వైపు తిప్పాలో నిర్ణయించుకోలేని అయోమయంలో అటూఇటూ తిప్పుతూ, కాసింత ఆవేశంగా, ఉద్రేకంగా, ఫ్రెంచి గడ్డాన్ని దాదాపుగా పీక్కున్నంత పనిచేస్తూ.. 'ఈ దేశంలో ఆర్యుల గురించి రాసేముందు ద్రావిడులెవరో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ద్రావిడులెవరో తెలియకుండా ఉత్తర కనుమల్లో

# అమ్మ ఒక అమృతం

- విజయదుర్గ



జన్మనిచ్చావు పొత్తిళ్ళలో పొందికగా
నన్ను నీ ప్రాణంగా పెంచావు
లాలపోసి లాలనగా చూసావు
అలుముకుంది నా చుట్టూ
వింతమాయగా ... నీ ప్రేమ
ఇంతలోనే ఊహ తెలిసి
తెలివి తెలిసింది
మాయని మమతను పెంచిన నువ్వు, నీ నవ్వు
నేనున్నంతకాలం నాతో ఉండవనీ
నీకు ఉండాలనున్నా
ఆ దేవుడు ఉండనివ్వడని...
ఈ నిజం తెలిసిన నా హృదయం బరువెక్కింది
జీర్ణించుకోని నిజాన్ని ఒప్పుకోక తప్పదని
ఎప్పుడో ఒకప్పుడు నా కళ్ళముందే
నన్ను విడిచి నా దేవత
తనువు చాలిస్తుందని...
రానే వచ్చింది ఆ దుర్దినం
నేను ఆపలేనని తెలిసినా
ఆపాలని చూశాను ఆరాటపడి
అందనంత ఎత్తుకు వెళ్ళిన నా ఆరాధ్యదైవం
నన్ను కుప్ప కూల్చేసింది
ఉన్న చోటనే గుండెలవిసేలా ఏడ్చినా
అరిచినా... తిరిగిరాదన్న నిజం....
అమ్మను తలుస్తూ ఓ రోజు సాయంత్రం
నా కుడిచేతిని నా ఎడమ చేతితో
తడిమి చూడగా
కలిగింది ఒక్క తియ్యని ఆలోచన...
ఆ మాతృమూర్తి
పేగుతెంచుకొనే కదా నా ఆరంభం
నా ఉచ్ఛ్వాసనిశ్వాసలన్నీ ఆమెవే కదా...
నా అమ్మ దేహం, రక్తం,
శ్వాస అన్నీ నాలో ఉన్నప్పుడు
అమ్మకూడా నాలోనే ఉన్నట్టే కదా...!
అవును...!
నేనిప్పుడు అమ్మగా మారి
మా అమ్మాయిలో అమ్మను చూస్తున్నాను...!!

❀❀❀

నివసించే గిరిజనుల జీవనవిధానాన్ని అంచనా వేయలేం. ఎప్పుడో ఇరాన్ నుండి వచ్చి ఇరాక్‌లో స్థిరపడి నయాగరా తీరాన్ని చేరుకొని అక్కడ్నుండి పశ్చిమ చైనాలోని ఓల్గాతీరాన్ని దాటి అండమాన్ నికోబార్ దీవులు దాటుకుంటు దక్షిణాదిన స్థిరపడ్డ వారు ద్రావిడులు అని ప్రచారం చేయడం ఈ బూర్జువా అర్యులకు అలవాటు అయిపోయింది..'

'సార్..! మేం గోహత్య గురించి.....'

'అక్కడికే వస్తున్నా..! ఈ దేశంలో అగ్రకుల, దళిత, బడుగు బలహీనులకు రక్షణ కరువైంది. ఎక్కడ చూసినా హత్యలు, రేపులు, దోపిడీ దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు...'

'సార్...! మేం గోహత్య నిషేధం గురించి....'

'వస్తున్నా.. వస్తున్నా.. అక్కడికే వస్తున్నా... భాషా చేతనత్వమూ, భాషా ఆపన్నత అనే అంశాల ఆధారంగా భాషల మనుగడ గురించి ఐరాస సర్వేలను నిర్వహించింది. అయితే ఈ ఆర్య అనార్య సంవాదంలో భాషలు బహురూపాలు సంతరించుకున్నాయి. అనువంశిక భాషాప్రసారం అంటే పుట్టిన ప్రతి బిడ్డా తల్లిదండ్రుల నుండి తెలుగు భాష నేర్చుకుంటున్నాడా లేదా అన్నది.....'

'సార్..! మేం గోహత్య నిషేధం గురించి...'

'ఇంకెంత సేపు.. అక్కడికే వస్తున్నా... ముందుగా గమనించాల్సిన విషయమొకటుంది. ఇప్పటికీ ఉత్తర భారతంలో హిందూ, జైనం, బౌద్ధం, సిక్కు, ఇస్లాం, క్రైస్తవం, వంటి వాటినన్నింటిని ధర్మాలు అనే అంటున్నారు. వాటిని దక్షిణ భారతంలో మతాలంటున్నారు. ఎందుకంటున్నారంటే అది వారిష్టం. ఎందుకనగూడదంటే అది నా ఇష్టం. ఇలా ఇష్టాఇష్టాలకు ఎలాంటి ప్రాముఖ్యత ఇవ్వకుండా ఈ మతాలు వైదికేతర శ్రమణ సంప్రదాయాలలో విస్తృత ప్రాచుర్యం పొందింది అంటున్నారు. మనుస్మృతిలో స్మృతి, శీలాలు, సత్పురుషుల ఆచారాలు ఆత్మసంతుష్టి గూడా ధర్మమూలమేనంటున్నది...."

'అయ్యా..! మేం గోహత్య నిషేధం గురించి....'

'కాస్త ఆగవయ్యా బాబూ...! అక్కడికే వస్తున్నా.. ఇండియాకు సముద్ర మార్గాన్ని కనుగొనడానికి బయల్దేరిన కొలంబస్ అమెరికా వెళ్ళారు. వాస్కోడగామా 15వ శతాబ్దిలో గానీ భరతఖండానికి రాలేదు. మరి రెండు వేల ఏళ్ల కిందట మనం రోమ్‌తో వ్యాపారం చేశామా..? అదెలా సాధ్యం..? నమ్మశక్యంగా లేకపోయినా ఇది నిజం...!'

'సరే..! ఒప్పుకుంటున్నాం.. కానీ మేం అడిగింది దేశంలో గోహత్య నిషేధం...."

'కాస్త ఓపిక పట్టు.. యాడికే వస్తున్నా... పంచభూతాలను శుభ్రం చేసి, ఔషధోపయోగ మూల పదార్థాన్ని వృక్షాలను వినియోగించి ప్రాణికోటి కోట్లకు ఉపయోగపడేటట్లు చేసేదే ఆయుర్వేదం. అమరకోశంలో పర్వత విశేషాలను గూర్చి ఎనిమిది శ్లోకాల్లో, వనౌషధి గురించి 169 శ్లోకాల్లో, మానవుని సేవకు, ఆనందానికి, ఔషధాలకు వినియోగపడే జంతువులు వాటి విశేషాలను గురించి 45 శ్లోకాల్లో చెప్పినారు...'

'సారూ..! మీకు దండం పెడతాము.. మేం అడిగింది దేశంలో గోహత్య నిషేధం గురించి....'

'వచ్చె.. వచ్చె.. అక్కడికే వస్తున్నా... సైద్ధాంతిక, తాత్విక స్థాయిల్లో తలెత్తిన ఘర్షణ ఎంతో ప్రభావం చూపింది. అసమానతలకు, అణచివేతకు గురవుతున్నామని భావిస్తున్న దళిత, స్త్రీ, తెలంగాణ స్థానీయ వాదులు సాహిత్య చరిత్రను తిరగరాయాల్సిన అవసరం ఉందనే వాదనను ముందుకు తెచ్చారు.

'మా బొంద..! అయ్యా నీ బాంచెన్.. ఎరక్కపోయి వచ్చాం.. మేం అడిగింది దేశంలో గోహత్య నిషేధం....'

'శాంతం, ఓపిక సముద్రం కంటే గొప్పవి.. వస్తున్నా.. అక్కడికే వస్తున్నా... మార్క్స్ చెప్పిన అదనపు విలువ సిద్ధాంతాన్ని స్థూలంగా అంగీకరించాలి. అయితే అందులో ఒక పెద్ద పొరపాటుంది. ఆ పొరపాటు నుండి కమ్యూనిస్టులు ఇప్పటికీ వేరు కాలేదు. అదనపు విలువంతా కార్మికుడి శ్రమ ఫలితమే అనేది మార్క్స్ సిద్ధాంతం. అయితే మార్క్స్ మోడీని ఊహించలేకపోయాడు. తాత్వికంగా ఆలోచిస్తే తర్కం బోధపడుతుంది. గాంధీవద్దే ఆగిన లెనిన్ కానీ ఓసామా బిన్ లాడెన్ కానీ సమకాలీన సమాజంలో వస్తున్న మార్పుల గురించి మార్క్స్ చెప్పిన సిద్ధాంతాన్ని కాదన్నందుకే ట్విన్ టవర్స్ కుప్పకూలిపోయాయి. సిరియాలో కానీ లెబనాన్‌లో కానీ




మనుగడ పోరాటాల కోసం సాగుతున్న ఉద్యమాలను నార్త్ ఈస్ట్ రాష్ట్రాల సమస్యలతో ముడిపెట్టలేం. అందుకే నేను చెప్పేదేమంటే....'

'ఇంకా నువ్వేం చెప్పినా నీ పీక పిసికి చంపేస్తాం.. నా కొడకా..! దేశంలో గోహత్య నిషేదం గురించి....'

'దేశంలోని ఏకైక బహుజన రచయితనైన నన్నే ఇంత అవమానిస్తున్నారంటే మీలో కులతత్వ నిర్మూలన జరగాల్సిన అవసరం ఉంది. తరతరాలుగా అగ్రకుల, దళిత, బహుజనులపై జరిగే వేదింపుల నివారణకోసం తక్కువ జనాభా కలిగి, కనుమరుగు అయిపోబోతున్న చిన్న చిన్న భాషా సమాజాల్ని గుర్తించాల్సి ఉంది. డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్.....'

పాపం..! చెప్పేవాడు బాగానే ఉన్నాడు. అడిగేవాడే హరీ అన్నాడు.

+++

అదండీ... గతితార్కిక భౌతికవాద రచయిత ఘనత...!

'అద్సరే కానీ....'

'ఇంతకు ఆ ర్యాలీ ఎందుకు..? ఆ భాజా భజంత్రీలు.. జిందాబాద్.. ముర్దాబాద్‌లు ఎందుకు అనేగా మీ సంకనాకిన సందేహం..?'

ఈ గతి తార్కిక భౌతికవాద రచయిత ఎన్ని రచనలు చేసినా ఏ పత్రికోడు వేసుకోలేదు. దాంతో స్వయంగా పుస్తకాలు వేసుకోవడం మొదలు పెట్టాడు. మొదటి పుస్తకంలో రాసిన సగం విషయాల్ని రెండో పుస్తకంలో పొందు పరిచాడు. మొదటి రెండు పుస్తకాల్లో ఉన్న విషయాల్ని కొన్ని తీసుకొని మూడో పుస్తకంలో వేసేశాడు. ఈ మూడు పుస్తకాల్లో ఉన్న మ్యాటర్ని తీసుకొని నాలుగో పుస్తకంలో వేసుకున్నాడు.. ఈ విధంగా రాస్తూనే ఉన్నాడు.. అయినా పాఠకులు కానీ, ప్రచురణ కర్తలు కానీ, అవార్డు దాతలు కానీ గుర్తించలేకపోవడంతో తిక్కరేగి బూతులు తిట్టడం మొదలుపెట్టాడు.

పత్రికాఫీసులకు వెళ్ళి అమరణ దీక్షలు చేస్తాననీ హడలెత్తించాడు. 'ఇదేం పీడరా బాబూ..' అనుకొని అప్పుడప్పుడు చిన్నా చితకా రచనల్ని వేసుకునేవారు. దానికే గతాభౌవా రచయిత ఒంటిస్తంభం మేడ మీద 'లాహిరి.. లాహిరి .. లాహిరిలో.. ఓహో జగమే ఊగెనుగా.. తూగెనుగా..' అంటూ పాడుకునే స్థాయికి వచ్చాడు.

దీంతో అతడి ఆకలి తీరలేదు. ఎలాగైనా సాహిత్య అకాడెమీ అవార్డు సంపాదించాలనుకున్నాడు..

'ఆ..! అయితే.. అనుకుంటే వచ్చేత్తుందా..?'

ఎటకారంగా అడిగాడు అప్పుడే వచ్చిన మా సుబ్బిగాడు.

'వచ్చేత్తుందా ఏమిటి నీ బొంద..! వచ్చేసింది కూడా..'

'ఎట్లా.. ఎట్లా.. ఎట్లా. .ఎట్లెట్లెట్లెట్లెట్లా..?'

'ఈ గతాభైవా రచయితకు చావు తెలివితేటలు బోలెడు ఉన్నాయి. డైరెక్టు కేంద్రసాహిత్య అకాడెమీ కార్యాలయానికి వెళ్ళి నా ముఖానికో అవార్డు పారేస్తారా లేక చచ్చి దయ్యమై పట్టుకోమంటారా..?' అని పేచీకి దిగాడు.

'దిగినంత మాత్రానా అవార్డులు ఇచ్చేయడమేనా..' సుబ్బిగాడు నోరు విప్పాడు మళ్ళీ.

'వీడో హౌలాగాడు అనుకొని వదిలేశారు. కానీ, అవార్డులు ఇచ్చే కమిటీలో ఫలానా సామాజిక వర్గానికి చెందిన వారు ఎక్కువ ఉన్నారనీ, అందుకే నాకు అవార్డులు ఇవ్వడం లేదని దుష్ప్రచారం చేస్తానని వార్నింగ్ ఇవ్వడంతో కంగుతిన్న అధికారులు 'వీడి మొహం మండా.. వీడికి శ్రాద్ధం పెట్టా..' అని తిట్టుకుంటూ ఓ అవార్డు పారేశారు.'

'ఇంతకీ కేంద్ర సాహిత్య అకాడెమీ ఇచ్చిన అవార్డు ఏమిటో..?'

'నీచ, నికృష్ట, బోరింగ్ రచనల శ్రేణిలో అత్యుత్తమ కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు ఇచ్చారు..'

'పీడా పోయింది. ఇంతకీ ఈ ర్యాలీ...' సుబ్బిగాడు ఏదో అడగబోయాడు.

'వస్తున్నా.. వస్తున్నా.. అక్కడికే వస్తున్నా.. కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు లభించినప్పటికీ ఈ గతాభౌవా రచయితకు రావాల్సినంత గుర్తింపు రాలేదు. దాంతో పరేషాన్ అయిన గతాభౌవా రచయిత సరైన సమయం కోసం వేచి చూడడం మొదలుపెట్టాడు. ఇంకా ఆ సమయం రాకపోవడంతో ఈ మధ్యకాలంలో కనిపించిన వాడినల్లా తిట్టడం, విమర్శించడం మొదలుపెట్టడంతో అతడి చుట్టుపక్కలకు కూడా ఎవరూ రాకుండా పోయారు..'

'అద్సరే.. ఈ ఊరేగింపు... ఈ జిందాబాద్.. ముర్దాబాద్....'

'అక్కడికే వస్తున్నా... ఈ మధ్య కొందరు రచయితలు, శాస్త్రజ్ఞులు దేశంలో పెరిగిపోతున్న మతతత్వానికి, హక్కుల హరణకు వ్యతిరేకంగా తమకు లభించిన కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డులు వాపసు ఇస్తున్నారు కదా..!'

'అవును ఇస్తున్నారు.. అయితే ఏం..?'

'ఒరే సుబ్బిగాడా..! నీకు పెగ్గులు వేసుకోవడంలో ఉన్నంత ఆసక్తి మిగతా విషయాల్లో లేదని తెల్సు కానీ, ఈ అవార్డులు వాపసు ఇవ్వడం వల్ల వాళ్ళకు దేశవ్యాప్తంగా, అంతర్జాతీయంగా తెగ ప్రచారం వచ్చేసిందనుకో.. అవార్డు వచ్చినప్పుడు వీళ్ళంటే ఎవ్వరో తెలియని వారికి కూడా ఆ అవార్డులు తిరిగి ఇచ్చే సమయంలో ప్రతివాడికి తెలిసిపోయారు. ప్రతివాడు వీరి గురించే మాట్లాడుకుంటున్నారు. అందరికీ తెలుసు.. అవార్డులు వాపసు ఇవ్వడం అనేది ఓ తతంగమనీ, వాతావరణం చల్లబడగానే ఎవడి అవార్డు వాడు తీసుకొని బీరువాలో దాచుకుంటారనీ.. కానీ, కాణీ ఖర్చులేకుండా ఇంత గొప్ప ప్రచారం వస్తుంటే, పైగా వీరంతా మేధావులనీ మీడియా కోడై కూస్తూంటే కొన్ని రోజుల కోసం ఈ అవార్డులు వాపసు ఇవ్వడంలో ప్రమాదం ఏముంది..?'

'అంటే ఈ గతాభౌవా రచయిత కూడా ప్రచారం కోసమే...'

'సహీ పక్డేరే సుబ్బిగాడా..? అందరితో పాటు ప్రచారం వస్తుందనే పేరాశతో ఈ తతంగం ముందు పెట్టుకున్నాడు ఈ గతాభౌవా రచయిత..' అంటూ ముగించాను.

సుబ్బిగాడు మళ్ళీ ట్రాన్స్‌లోకి వెళ్ళిపోయాడు. సంతోషంగానో, దు:ఖంగానో, కోపంగానో మాకైతే తెల్వదు..!!

❀❀❀


## ఆలోచించు...!




**- కీసరి నర్సయ్య**

కళ్ళు తెరిస్తే జననం ... కళ్ళు మూస్తే మరణం
రెప్పపాటు కాలమే జీవితం
కళ్ళు తెరిచి కాలాన్ని మారుస్తావో
కళ్ళు మూసుకొని జీవచ్ఛవంలా
జీవిస్తావో .. నిర్ణయించుకో
పడుకోవడంలోనే పసితనం పోయింది
ఆటపాటలతో బాల్యం గడిచింది
ముసలితనంలో మూలకు పడిఉంటావు
ఇక మిగిలినదెంతో తేల్చుకో నేస్తం...
అనుకున్నది జరగక పోవడం
జరిగేది అనుకోకపోవడమే జీవితం
ఎవరో వస్తారనీ .. ఏదో చేస్తారనీ ..
ఎందుకా ఆలోచన? ఎవరి కొరకు నిరీక్షణ?
మస్తిష్కం మసిలి మనసు ఎదిరిస్తే
సమాధానం లేని ప్రశ్నవుతావు...
ఆవేశం కాదిది .. ఆవేదన.. ఆలోచన...!
మతి చలించి కాదు నేస్తం
మది జ్వలించి వస్తున్న మాటలివి...!!

❀❀❀


A.V. NAGESWARA RAO
PRO - Shriram Chits (M) Ltd.
anr28@rediffmail.com
Mob.: 9029434560 / 9833434572
మీ విశ్వసనీయమైన ఆర్థిక
నేస్తం-నేటికీ, ఏనాటికీ!
శ్రీరామ్ చిట్స్
శ్రీరామ్ చిట్స్ (మహారాష్ట్ర) లిమిటెడ్,
418-419, బెజోలా కాంప్లెక్స్ సుమన్ నగర్ ఎదురుగా,
సియోన్-ట్రాంబే రోడ్, చెంబూర్ ఈస్ట్, ముంబయి-71.
ఫోన్ : +91 22 42680800-99
Shriram Chits
Empowering People Through Prosperity
• Chit Funds
• Deposits
• Life Insurance
• General Insurance
• Personal Loans
• S.M.E. Loans
• Loans Against property
• Gold Loan
• Loan For Gold Purchase
Shriram Chits (Maharashtra) Ltd.,
418-419, Bezzola Complex, Opp. Suman Nagar,
Sion-Trombay Road, Chembur (E), Mumbai - 400 071
Tel.: 42680800 - 99 Fax: 42680822

చర్చ

# ఎవరు ఎవరికి వ్యతిరేకం...?

- ఆర్యం

ఎన్ని పాడు వార్తలు మోసుకొచ్చినా, ఉదయం పూట మనసంతా వికారం కలిగించే రక్తపు మడుగుల్లో ముంచినా ఎందుకో తెలియదు కానీ న్యూస్ పేపర్ అంటే ఎనలేని అభిమానం నాకు. ఉదయం మా ఆవిడ ఇంటిల్లిపాదిపై గొణుక్కునే సుప్రభాతంతో కళ్ళు తెరిచి న్యూస్ పేపర్ చేతుల్లోకి తీసుకొని అసాంతం చదవనిదే బెడ్డు దిగడం అసలే ఇష్టం ఉండదు. ఈ దౌర్భాగ్యపు అలవాటు మానుకోవాలనీ దశాబ్దాలుగా ప్రయత్నిస్తున్నా విజయం సాధించలేకపోయాను.

పేపర్ చదవడంలో ఒక్కో మనిషికి ఒక్కో పద్ధతి ఉంటుంది. నాకు మొదటి పేజీ మొదటి అక్షరంతో మొదలుపెట్టి చివరి పేజీ చివరి అక్షరం వరకు చదవడం అలవాటు. ఆ రోజు కూడా నేను పేపర్ చేతిలోకి తీసుకొని కళ్ళను పరుగెత్తించ సాగాను. అకస్మాత్తుగా నా చూపులు ఒక వార్తపై నిలిచిపోయాయి.

**'హిందూ మతోన్మాద వ్యతిరేక వేదిక ఏర్పాటు..'**

ఇదేదో ఆసక్తికరంగా ఉందని ఆ వార్త మొత్తం గబగబ చదివేశాను. దేశంలో హిందుత్వ శక్తుల ఆగడాలు మితిమీరుతున్నాయనీ, హిందూ మతోన్మాదాన్ని అరికట్టేందుకు 40 సంఘాలతో వ్యతిరేక వేదిక ఏర్పాటు చేస్తున్నామనీ నిర్వాహకులు పేర్కొన్నట్లుగా వార్త రాశారు.

నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఒక చెంపపై కొడితే ఇంకో చెంప చూపించమన్న గాంధీవాదాన్ని నమ్మే హిందువులు ఎక్కడ, ఎలా, ఎప్పుడు మతోన్మాదానికి పాల్పడ్డారో అర్థం కాలేదు. హిందువుల వల్ల ఈ దేశంలో ఉన్న హిందువేతర మతాల వారికి ఎక్కడ అన్యాయం జరుగుతుందో తెలియడం లేదు. అసలు ఈ మతాల గోల ఎందుకో అది కూడా సామాన్యులకు సరిగ్గా అర్థం కావడం లేదు.

ఎక్కడో ఏదో ఒక పార్టీకి చెందిన కొందరు గూండాలు ఎవడో ఒకడి ముఖానికి నల్ల రంగు పూస్తే, ఎవడో ఒక రాజకీయ నాయకుడు తలాతోక లేకుండా ముస్లింలు పాకిస్థాన్‌కు వెళ్ళిపోవాలని ఫర్మాన్ జారీ చేస్తే, వ్యతిరేక సిద్ధాంతాలను ఎదుర్కోలేక అసమర్థులైన కొందరు నేరప్రవృత్తి గల వ్యక్తులు (ఏ మతం వారో తెలియదు...) కుల్బర్గీ లాంటి హేతువాదుల్ని హత్యచేస్తే ... అది వారి వ్యక్తిగత ఉన్మాదం అవుతుంది కానీ హిందూ మతోన్మాదం ఎట్లా అవుతుందో నాకైతే అర్థం కావడం లేదు.

మతోన్మాదం అనేదే పిచ్చోళ్ళ చేతిలో రాయిలాంటిది. మతోన్మాదాన్ని వ్యతిరేకించడం అనేది ప్రతి సామాజిక స్పృహ కలిగిన వ్యక్తి చేయాల్సిన పనే.. రాజ్యాంగం పై నమ్మకం ఉన్న ప్రతి పౌరుడు మతోన్మాదాన్ని ఖండించాల్సిందే. కానీ మతోన్మాదాల్లో హిందూ మతోన్మాదం, ముస్లిం మతోన్మాదం అంటూ వివక్షలు పాటిస్తూ మతోన్మాదాన్ని వ్యతిరేకించడం అంటే ఇదో రకమైన మతోన్మాదమే అనుకోవాల్సి ఉంటుంది.

నిజం చెప్పాలంటే మన దేశంలోనే కాదు, ప్రపంచ దేశాల్లో ఎక్కడ చూసినా ఏదైనా మతోన్మాదం విషజ్వాలలు కక్కుతుందంటే అది ముస్లిం మతోన్మాదమే అన్న నిజం చెడ్డీలు వేసుకోలేని చిన్న పిల్లాడు కూడా చెబుతాడు. ఎక్కడ చూసినా ఇస్లాం పేరుతో నరహత్యలు రాక్షసంగా చేస్తున్నారు. పసిపిల్లల చేతికి తుపాకులు అందించి మానవత్వాన్ని మంటగలుపుతున్నారు.



మహిళలకు బుర్ఖాల పేరుతో రాతియుగం లక్షణాల శిక్షను విధిస్తున్నారు. కత్తులతో మనుషుల కుత్తుకల్ని కోయడమే కాకుండా జుగుప్సాకరంగా ప్రపంచానికి ఆ దృశ్యాలు పంపిస్తున్నారు. పాఠశాల విద్యార్థులపై దాడి చేసి చిన్నారులను చిదిమేస్తున్నారు. వీళ్ళంతా ముస్లిం మతోన్మాదులు కాదా...?

మన దేశం వరకు వస్తే కాశ్మీర్ నుండి పండితుల్ని కుక్కల్ని తరిమినట్టు తరిమి కొట్టారు. ముంబయి దాడులకు స్థానిక ముస్లింలు సహకరించారు. పార్లమెంట్ దాడుల్లో స్థానిక ముస్లింలు తోడయ్యారు. రైల్లో ప్రయాణం చేస్తున్న యాత్రికుల్ని సజీవ దహనం చేసి గోద్రా అల్లర్లకు శ్రీకారం చుట్టింది ఎవరో అందరికీ తెలుసు. 15 నిమిషాలు పోలీసులు కళ్ళు మూసుకుంటే హిందువులను ఊచకోత కోస్తామనీ బహిరంగంగా హెచ్చరించింది ఏ మతస్తుడో ఇంకా ఎవరూ మరిచిపోలేదు. దేశవ్యాప్తంగా జరిగే నేరాల్లో మతపరంగా చూస్తే ఎవరు ఎక్కువ నేరాలకు పాల్పడుతున్నారో ఇట్టే తెలిసిపోతుంది. రాజకీయంగా ఎంతో ఎదిగి, ఉన్నతమైన పదవులు అధిరోహిస్తూ కూడా వందేమాతరం పాడేది లేదని భీష్మించుకుంటే అది ఎలాంటి మతసామరస్యమో జనం గమనిస్తూనే ఉన్నారు. మతం అంటే మనిషి నడవడిక మాత్రమే. మనిషి నడవడికనే మతంగా రూపొందింది తప్ప మతమనేది శిలాశాసనం కాదు.

కానీ, ఏ మేధావి కూడా ఇది ఇస్లాం మతోన్మాదం అని ప్రకటించలేదు. పైగా ఉగ్రవాదులకు ఒక మతం అంటూ ఉండదు అని, ఆ దాడులకు, ఆ నేరాలకు ముస్లింలకు, ఇస్లాంకు ఎలాంటి సంబంధం లేదని చెబుతారు. అది నిజమే అని అందరూ నమ్ముతున్నారు. అందుకే ఈ దేశంలో హిందువులు, ముస్లింలు సోదరభావంతో మెదులుతున్నారు.



హిందువులంతా ముస్లిం సోదరులందరికీ వ్యతిరేకం కాదు. వ్యతిరేకంగా మాట్లాడిన వారు ఒకవేళ హిందువులైతే వారు హిందువులందరికీ ప్రతినిధులు కాదు. ముస్లిం ఉగ్రవాదులతో ముస్లింలకు ఎలాంటి సంబంధం లేదనీ, ఇస్లాంలో హింసకు చోటు లేదని కబుర్లు చెప్పే మేధావులు మరి హిందూ మతోన్మాద వ్యతిరేక వేదిక ఎలా ఏర్పాటు చేస్తున్నారు..? సంఘవిద్రోహ పనులకు పాల్పడే ముస్లింలతో ముస్లిం మతానికి ఎట్లాగయితే సంబంధం లేదో అట్లాగే మసిపూసినోళ్ళకు, చెత్తవాగుడు వాగే వాళ్ళకు, హిందూవాద రాజకీయ పార్టీలకు హిందూమతంతో సంబంధం లేదని గ్రహించాలి. గణాంకాల ప్రకారం చూస్తే ప్రపంచవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ముస్లిం మతోన్మాదమే ఎక్కువ. ముస్లిం మతోన్మాదం గురించి విదేశాల ప్రముఖులు కూడా ఎన్నోమార్లు ఆందోళన వ్యక్తం చేసిన సంఘటనలు ఉన్నాయి.

ఎవరో కొందరు నేరప్రవృత్తిగల వారు, ఏవో కొన్ని చిల్లర సంస్థలు హిందూమతోన్మాదం గురించి మాట్లాడితే అది మొత్తం హిందూమతానికి ఎలా అన్వయిస్తారు..? నిజంగానే మతోన్మాదాలను వ్యతిరేకించాలనుకుంటే అన్ని మతాల మతోన్మాదాల్ని వ్యతిరేకించాలి. కానీ దెప్పిపొడిచినట్లు, అవమానించే పద్ధతిలో 'హిందూ మతోన్మాద వ్యతిరేక వేదిక' అని నామకరణం చేయడం ఎంత వరకు సబబు..?

ఈ దేశంలో ప్రముఖులుగా చెలామణి కావాలన్నా, మేధావిగా పేరుపొందాలన్నా ఒకటే సూత్రం... 'హిందువులను తిట్టాలి.. హిందూ దేవతల్ని అవమానించాలి.. హిందూ మతాన్ని ద్వేషించాలి...' అంతే రాత్రికి రాత్రి సెలబ్రిటిలుగా మారిపోతారు. ఈ చవకబారు ప్రచారం కోసం నేరస్తులకు, ఉగ్రవాదులకు పరోక్షంగా స్ఫూర్తిని కలిగిస్తున్నారనే నిజాన్ని వీరు గ్రహించాలి. అన్నదమ్ముల్లా కలిసి బతుకుతున్న హిందూ ముస్లిం సోదరుల మధ్య కావాలనీ ఇలాంటి సంస్థలు పెట్టి సామాన్య హిందువు మదిలో కూడా మత దురాభిమాన బీజాలు నాటుతున్నారు. పేరు ప్రఖ్యాతులు కలిగి, కీర్తి ప్రతిష్టలు పొందిన, ధనాధిపతులైన ముస్లింలు కొందరు అతిగా ఊహించుకుంటున్నారు తప్ప ఈ దేశంలో ఏ ఒక్క ముస్లిం వ్యక్తికి ఏ ఒక్క హిందువుతో ఎలాంటి ప్రమాదం లేదు. ఉంటే గింటే వివిధ ఉగ్రవాద సంస్థల పట్ల ఆకర్షితులవుతున్న కొందరు ముస్లింలతోనే హిందువులకు, మానవజాతికి ప్రమాదం ఉందని నిర్మొహమాటంగా చెప్పొచ్చు.

ఎవడన్నాడు ఈ దేశం కేవలం హిందువులదని..? అన్నవాడికి హిందువులంతా ఏకగ్రీవంగా అధికారం

ఇచ్చారా..? ఈ దేశం హిందూ, ముస్లిం, సిక్కు ఇసాయిలందరిదీనూ...! ఇది చిన్నప్పట్నుండి నేర్చుకుంటున్న ఆదర్శం. ఇప్పటికీ నూటికి తొంబై శాతం ఈ సూత్రాన్ని, ఈ ధర్మాన్నే పాటిస్తున్నారు. అందులో హిందువులున్నారు... ముస్లింలు ఉన్నారు.. అన్ని మతాల వారున్నారు.

అలాంటప్పుడు ఇలాంటి వివక్ష పాటిస్తూ, ఒక మతాన్ని వ్యతిరేకించే వ్యక్తుల కూటమిని మేధావుల కూటమి అనేందుకు మనసొప్పదు. ఇలాంటి సంస్థలు చేసే అవివేకపు పనుల వల్ల మతపరంగా తటస్థంగా ఉండే సామాన్య హిందువు మదిలో కూడా ద్వేషం రగిలే అవకాశం ఉంది. ఉగ్రవాదానికి, మతోన్మాదానికి మతం రంగు పూయొద్దంటూనే హిందూ మతానికి అలాంటి రంగులు అద్దడం సబబు కాదనే చెప్పాలి. అందుకే ఈ దేశంలో మేధావులను ఎవ్వరూ విశ్వసించడం లేదు. ఇలాంటి చర్యల వల్లనే హిందూ మతోన్మాదం పెరిగే అవకాశం కూడా ఉంది. అలాంటిదేదైనా జరిగితే అందుకు కారణం మేధావులే అవుతారు. మతోన్మాదులు అనే పదానికి క్రమక్రమంగా నిర్వచనం మారిపోతున్నట్టుంది..!!

ఇది భారతదేశం.. ఇది మనందరి దేశం.. దీన్ని ఇలాగే ఉండనీయండి... లేనిపోనివి ఊహించుకొని, ప్రచారాల కోసం సంచలనాల కోసం దేశ ఐక్యతకు తూట్లు పొడవద్దని మనవి.

❀❀❀

## ఒక మనవి

ఆంధ్రమహాసభ సభ్యులందరికీ సరికొత్తగా గుర్తింపు కార్డులు ఇవ్వాలని సంకల్పించాం. కావున సభ్యులందరు ఈ క్రింద ఇచ్చిన కూపన్‌లో తమ వివరాలన్నీ స్పష్టంగా ఇంగ్లీష్ భాష లో పెద్ద అక్షరాల్లో పూర్తి చేసి పంపించాలనీ మనవి. వీలైతే ఇదే కూపన్‌ను కట్ చేసి, లేకుంటే ఈ వివరాలన్నీ తెల్లకాగితంపై వివ రంగా రాసి మహాసభ కార్యాలయానికి అందచేయాలనీ మనవి.

పేరు:-------------------------------

పుట్టిన తేదీ:--------రక్తపు గ్రూపు:------------

చిరునామా:------------------------------

ఫోన్ / సెల్‌నం:---------------------------

మెయిల్:------------------------------

పీజీ/ ఎల్‌జీ/ ఎల్‌ఎల్ క్రమసంఖ్య-----


**తాజా ఫోటో ఒకటి జతచేయగలరు.**

## గోదావరీ నీకు వందనం





– ఓరుగంటి సుబ్రహ్మణ్యం

మహాదేవుడు జడముడి విడువంగా
భువికి దిగివచ్చిన గోదారిగంగా
నీకు వందనం...
బ్రహ్మగిరి శిఖరాన వెలిసి
త్రయంబకేశ్వరున్ని ఆరాధించి
గిరులు దాటి, సుడులు తిరిగి, పరుగులిడి
బాసర చదువుల తల్లిని పలకరించిన
గోదావరీ నీకు వందనం...
తల్లిదీవనలందుకొని
పరుగుపరుగున పోయి
ధర్మపురి నరసింహున్ని పూజించి
కాళేశ్వర, ముక్తేశ్వరులను సేవించిన
గోదావరీ నీకు వందనం...
కొండలు కోనలు దాటుతూ
గలగలా పారుతూ
భద్రాద్రి రాముని పాదాలు కడిగిన
గోదావరీ నీకు వందనం ...
సీతారాముల ఆనతినొంది
పట్టిసీమ వీరభద్రుణ్ణి గాంచి
ఉరవళ్ళు పరవళ్ళుతో
పాపికొండలను తాకి
రెండుగా చీలి కోటిపల్లి రేవు చేరి
కొనసీమలో కనకవర్షం కురిపించిన
గోదావరీ నీకు వందనం ...
ఋషుల సంచారతీరమై
నన్నయాది కవులకు కన్నతల్లివై
సాహితీఝరిగా
దక్షిణగంగగా వెలుగొందిన
గోదావరీ నీకు వందనం ...
భక్తకోటికి ఊరటనిచ్చి
నేలతల్లికి హరితహారం వేసి
అంతర్వేదివై
అలసిసొలసి సాగరాన చేరిన
గోదావరీ నీకు వందనం...!!



❀❀❀


Consulting Orthotist & Prosthetist
Dantala P. S. : 9821122034
Estd : 1988
DISSCO
Shree siddhi surgicals
PROSTHETIC & ORTHOTIC CENTRES
(SPECIALISTS IN DIABETIC FOOTWEAR)
Below Knee Aftificial Limb
Cutches Axilla / Elbow
Cervical Collar for Neck Pain
Wheel Chair & Walking Aids
Back Brace for Vertebral Extension
Vericose Vein Stockings
Below Elbow Artificial Hand
Back Pain belt For Lumbar Pain
Diabetic Shoes & Sandles
Computerised Foot Scanning & Foot Scanners from USA
HEAD OFFICE :
2-9/A, Merwanji Building, Gr. Floor, Opp. K.E.M. Hospital
Gate No. 4, D.C. Road, Parel, Mumbai - 400 012
Tel.: 2412 1729 / 2410 1097 / Telefax : 2415 0097
BRANCH OFFICE :
22/201, Anand Bhuvan, Gr. Floor, T.H. Kataria Marg,
Shobha Hotel Lane, Near Hinduja Hospital Bus Stop,
Mahim (W), Mumbai - 400 016
Tel.: 2446 1090 / 2444 0379
20 Years in the Service of Disabled
Advt
Website : www.sssurgicals.com / E-mail : sales@sssurgicals.com

తెలుగు బాంధవులందరికీ

# నూతన సంవత్సర మరియు సంక్రాంతి పర్వదిన

# శుభాకాంక్షలు



భవదీయుడు,
వాసాల శ్రీహరి (వంశీ)

అధ్యక్షులు
పద్మశాలి సమాజ సుధారక మండలి, వర్లీ



!! Om Shri Ganeshaya Namah !!

Since : 2005

**ART THAT WORK WONDER**

Raghunath Kattekola

**R.K.GRAPHICS**

ఆర్. కె. గ్రాఫిక్స్ తరపున

Happy New Year 2016

**TELUGU SOUVENIR DESIGNED FOR**

Padmashali Mitra Mandali, Prabhadevi - 2011
Jagruti Sports Club Sarvajanik Ganesh Utsav Mandal, Worli - 2011
Telugu Gangaputra Seva Sangam, Worli - 2012
Satyananda Bhakta Mandali, Prabhadevi - 2012
Jagruti Sports Club Sarvajanik Ganesh Utsav Mandal, Worli - 2012
Padmashali Yuvak Sangh, Naigaum - 2013
Vivek Granthalaya, Prabhadevi - 2013
Jagruti Sports Club Sarvajanik Ganesh Utsav Mandal, Worli - 2013
Korutla Padmashali Seva Sangam, Mumbai, Worli - 2014
Swarnandhra Cultural Association, Prabhadevi - 2014
Jagruti Sports Club Sarvajanik Ganesh Utsav Mandal, Worli - 2014
Vinayak Nagar Sarvajanik Ganesh Utsav Mandal, Prabhadevi - 2014
Shri Telugu Seva Sangh, Antop Hill - 2015
Jagruti Sports Club Sarvajanik Ganesh Utsav Mandal, Worli - 2015
Andhra Kala Samithi, Panvel - 2015

ప్రతి సుమం
సుగంధ భరితం
ఈ కొత్త సంవత్సరంలో
మీకు ప్రతిక్షణం
ఆనందభరితం !



విష్ యు హ్యాపీ
న్యూ ఇయర్ !


111/78, Worli, B.D.D. Chawl, Mum - 18 | Tel.: 98197 41079 | Email : rkattekola@gmail.com

జరగబోయే కార్యక్రమాలు

## వైకుంఠ ఏకాదశి

**తేది: 21.12.2015**

**సోమవారం,**





సామాజిక, ఆర్థిక, విద్య, వైద్య, సాహితీ, కళా రంగాల్లోనే కాకుండా ఆంధ్రమహాసభ ఆధ్యాత్మిక రంగంలో కూడా తనవంతు సేవలనందిస్తున్న విషయం విధితమే కదా..!

అదే పరంపరలో డిసెంబర్ 21 నాడు ఆంధ్రమహాసభ, పూజా మందిర్ ట్రస్ట్ సంయుక్త అధ్వర్యంలో 'వైకుంఠ ఏకాదశి' వేడుకల్ని నిర్వహిస్తున్నాం.

సోమవారం ఉదయం 3.30 గం॥లకు పంచోపనిషత్ ద్వారా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారికి అభిషేకం జరుగుతుంది. ఉదయం 5.30 గం॥లకు వైకుంఠ దర్శనప్రాప్తి ఉంటుంది. ఆ తర్వాత ప్రసాద వితరణ జరుగుతుంది.

ఆధ్యాత్మిక వాదులు, భక్తులంతా భారీ సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొని స్వామివారి కృపాపాత్రులు కావాలని పూజా మందిరం ట్రస్టీ చైర్మెన్ ఏఎస్ఆర్ కృష్ణప్రసాద్, కార్యదర్శి ఎస్వీ రామారావు మనవి చేస్తున్నారు.

---

జరగబోయే కార్యక్రమాలు

## ఘంటససాల జయంతి

**తేది: 26.12.2015**

**శనివారం, సా॥ 6.30 గం॥ నుండి**

## ఘంటసాల జయంతి సందర్భంగా 'స్వరమాధురి' వారి గానకచేరీ మరియు ఆచార్య డా॥ఎన్.గోపిగారికి జీవసాఫల్య పురస్కార ప్రదానం.

ఒక జాతి ఔన్నత్యం ఆ జాతి సాహితీ, సంస్కృతులపై ఆధారపడి ఉంటుంది. సాహిత్యం, సంగీతం జాతి విశిష్టతను తెలియచేస్తాయి. ప్రస్తుతం మన తెలుగు భాషలో ఎంతో ఉన్నతమైన సాహిత్యం వస్తోంది. అందుకు కారణం శిఖరాగ్ర స్థాయికి చేరుకున్న మన సీనియర్ కవులు, రచయితలే...! వారిని ఆదర్శంగా తీసుకొని ఎందరో వర్ధమాన కవులు రచయితలు సాహిత్యాన్ని సృజిస్తున్నారు. తెలుగు భాషకు సేవలందిస్తున్నారు.

నేటితరం ఆదర్శంగా తీసుకోవాల్సిన సాహితీవేత్తల్లో ఆచార్య డా॥ఎన్.గోపిగారు ఒకరు. తెలుగు కవిత్వానికి దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చి, జాతీయ స్థాయి కవుల్లో తనకంటూ తనదైన విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్నారు.

డా॥గోపిగారు ఇప్పటి వరకు...



- ఇరవై కవితాసంపుటాలు వెలువరించారు.
- ఆరు విమర్శా వ్యాస సంపుటాలు రాశారు.
- నాలుగు పరిశోధనా గ్రంథాలు వెలువరించారు.
- అయిదు పుస్తకాలు అనువదించారు
- రెండు వ్యాఖ్యాన గ్రంథాలు రచించారు.
- అయిదు యాత్రాస్మృతులు రాశారు
- ఇతరాలు మరో ఆరు పుస్తకాలు వెలువరించారు.

వీటితో పాటు వయోజన విద్యకోసం, పాఠశాలల కోసం నాలుగు పాఠ్యపుస్తకాలు కూడా రచించారు. నూతన తెలంగాణ రాష్ట్ర పాఠ్యప్రణాళిక రాష్ట్ర కమిటి సలహాసభ్యులుగా, డిగ్రీ తెలుగు పాఠ్యపుస్తకాల ప్రధాన సంపాదకులుగా సేవలందిస్తున్నారు.

డా॥గోపిగారు రాసిన జలగీతం, ఇంగ్లీష్‌తో సహా మరో తొమ్మిది జాతీయ భాషల్లోకి అనువదించబడింది. తెలుగు సాహిత్యంలో నానీల ప్రక్రియను ప్రారంభించి వందలాది నూతన కవులకు మార్గదర్శకులయ్యారు. నానీల నాన్నగా మన్ననలు పొందారు. గోపి గారు ఆవిష్కరించి రాసిన నానీలు 12 భాషల్లోకి అనువదింపబడడం నిజంగా విశేషం. నానీల ప్రక్రియ తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియలకంటే ఎక్కువ ఆదరణ పొందడం మరో విశేషం.

గోపిగారికి ఎన్నో అవార్డులు రివార్డులు లభించాయి. అంతేగాక 'నానీల త్రివిక్రముడు', 'కవితా ప్రపూర్ణ', 'నానీల నాన్న', 'అభినవ వేమన' లాంటి ఎన్నో బిరుదులు కూడా లభించాయి.

గోపిగారు రాసిన 'కాలాన్ని నిద్రపోనివ్వను' కవితాగ్రంథానికి కేంద్రసాహిత్య అకాడెమీ అవార్డు లభించింది. అంతేగాక, ఈ పుస్తకం 21 భాషల్లోకి అనువదింపబడింది. బహుశ.. ఒక తెలుగు కవితా సంపుటి ఇన్ని భాషల్లోకి అనువదింపబడడం ఇదే మొదటిసారేమో...!

వేమనపై పరిశోధన చేసి 'అభినవ వేమన'గా పేరుపొందిన డా॥గోపిగారు గొప్ప పరిపాలనా దక్షులు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా అనేక సేవలందించారు. ఆయన హయాంలో ఆంధ్రమహాసభతో కలిసి సంయుక్తంగా ముంబయిలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. ముంబయిలో తెలుగు కవిత్వానికి ప్రోత్సాహం అందించిన వారిలో డా॥గోపిగారిని ప్రముఖంగా చెప్పుకోవాలి. ప్రస్తుతం కేంద్ర సాహిత్య అకాడెమీ తెలుగు తెలుగు సలహా మండలి సంచాలకులుగా, కార్యనిర్వాహక సభ్యులుగా విధులు నిర్వహిస్తున్న డా॥గోపిగారికి ఆంధ్రమహాసభ అండ్ జింఖానా తరఫున 'జీవసాఫల్య పురస్కారాన్ని' ప్రదానం చేయనున్నాం. ముంబయి పరిసర ప్రాంతాల తెలుగు సాహితీ అభిమానులు, కవులు, రచయితలు ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో పాల్గొనాలని మనవి చేస్తున్నాం.

**ఘంటసాల జయంతి సందర్భంగా గానకచేరి.**



తెలుగు పాటకు పర్యాయ పదం అంటే ఘంటసాల వెంకటేశ్వరరావుగారే.. ఆయన మరణించి నాలుగు దశాబ్దాలు దాటినా ఇప్పటికీ ఆయన పాడిన పాటలు ప్రతి చోట వినిపిస్తూనే ఉన్నాయి. ఆయన అమరగాయకుడు. మరణంలేని గాన గంధర్వుడు.

కృష్ణా జిల్లా, గుడివాడ తాలూకా, చౌటపెల్లి గ్రామంలో 4 డిసెంబర్, 1922లో ఒక సాంప్రదాయ బ్రహ్మణ కుటుంబంలో జన్మించిన ఘంటసాల వెంకటేశ్వరరావు దాదాపు 13వేల పాటలు పలు భాషల్లో పాడి శ్రోతల గుండెల్లో చిరంజీవిగా నిలిచిపోయారు. తరాలు మారినప్పటికీ ఇప్పటికీ ఆయన గొంతు మరింత ఆదరణ పొందుతు దశదిశల మారుమ్రోగుతూనే ఉంది.

ఘంటసాల గారు పలు భాషల్లో దాదాపు 100 సినిమాలకు సంగీత దర్శకత్వం వహించారు. ఆయన తెలుగులో సంగీతం సమకూర్చిన పాతాళభైరవి, మాయాబజార్, లవకుశ, పాండవ వనవాసం, రహస్యం, గుండమ్మ కథ, పరమానందయ్య శిష్యుల కథ లాంటి సినిమాల్లోని పాటలు నేటికీ తాజాగా శ్రోతలకు వీనుల విందు చేస్తూనే ఉన్నాయి. ఆ పాటలు అజరామరం అనడం అతిశయోక్తి కానేకాదు.

పద్మశ్రీ బిరుదాంకితుడైన ఘంటసాలగారి పేరుమీద అమెరికా పోస్టల్ విభాగం వారు 6 అక్టోబర్, 2014 నాడు ప్రత్యేక పోస్టల్ స్టాంపును విడుదల చేశారంటే ఆయన కీర్తికి ఎల్లలు లేవని, ఆయన గానానికి ఖండాంతరాలు కూడా సరిపోవని స్పష్టమవుతోంది.

అలాంటి గాన గంధర్వుని జయంతి సందర్భంగా ముంబయిలో మొదటిసారిగా తెలుగు సంగీత బృందాన్ని స్థాపించి ఇప్పటికీ పలు నగరాల్లో యాభైకి పైగా కచేరీలు నిర్వహించిన శ్రీమతి గిరిజా ద్విభాష్యం గారి 'స్వరమాధురి' వారి పాటల కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఇదే మనందరి తరఫున ఆ అమరగాయకునికి ఆత్మీయ నివాళి.

మీరంతా ఆంధ్రమహాసభకు చెందిన సాంస్కృతిక, సాహిత్య విభాగాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో విచ్చేసి ఒక గొప్ప సాహితీవేత్తకు, కీర్తిశేషులైన మరో గొప్ప సంగీతకారునికి తగిన గౌరవాన్ని అందించాలనీ,

తద్వారా మనం కూడా గౌరవాన్వితులం కావాలని కోరుతున్నాం.



**కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ**

**6.30 గంటల నుండి 7.30 గంటల వరకు అల్పాహారం, టీలు అందించడం జరుగుతుంది.**

**కార్యక్రమం అనంతరం రాత్రి పది గంటలకు ఆత్మీయ భోజనం కూడా ఉంటుంది.**

(నోట్ : ప్రతి నెల పౌర్ణమి నాడు నిర్వహించే 'ఎన్నీల ముచ్చట్లు' కార్యక్రమాన్ని ఈ కార్యక్రమం మూలంగా ఈ నెల నిర్వహించడం లేదు. ఆచార్య డా॥ ఎన్.గోపిగారి సన్మాన సభకు ముంబయిలోని సాహితీ మిత్రులంతా రావాల్సి ఉంటుంది. వరుసగా రెండు రోజులు రావడం కవులకు ఇబ్బందికరంగా ఉంటుందని ఎన్నీల ముచ్చట్లను మానుకోవాల్సి వచ్చింది. అందుకు చింతిస్తున్నాం.)


---

**జరగబోయే కార్యక్రమాలు**

## నూతన సంవత్సర వేడుకలు

**తేది: 06.01.2016**

**బుధవారం, మ॥ 3.00 గం॥లకు**




కాలం మారడానికి ప్రతీక నూతన సంవత్సర ఆగమనం. పాత క్యాలెండర్‌కు వీడ్కోలు పలికి కొత్త క్యాలెండర్‌కు స్వాగతం పలికే సమయం. నిన్నకు సెలవుచీటి ఇచ్చి నేడులో ప్రస్థానిస్తూ రేపటిపై ఆశలు పెంచుకోవడమే మనిషి జీవితం. రాబోయే ప్రతి కొత్త సూర్యుడు ఏదో మంచి చేస్తాడనీ ఆశించడం, అభిలషించడం మనిషి నైజం.

పలు జ్ఞాపకాలను మన మనస్సుల్లో పదిలపరిచిన 2015 సంవత్సరానికి వీడ్కోలు పలికి పలు ఆకాంక్షలతో, ఆశలతో 2016 కు స్వాగతం పలకడమే ఈ వేడుకల ఉద్దేశ్యం.

ఈ నూతన సంవత్సర వేడుకల్లో మహిళలు, పిల్లలు అందరూ భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనీ మహిళాశాఖ తరఫున కోరుతున్నాం.


---

**జరగబోయే కార్యక్రమాలు**

## సినిమా ప్రదర్శన


**తేది: 10.01.2016**


**ఆదివారం, ఉ॥ 10.30 గం॥లకు**



ప్రస్తుత సమాజంలో వినోదానికి ప్రధాన సాధనం సినిమా అన్న విషయం తెలియంది కాదు. కానీ, నేడు ఒక కుటుంబం మొత్తం కలిసి ఒక సినిమాకు వెళ్ళడం అంటే తలకు మించిన భారంగా మారుతోంది. అందుకే మనసులోని ఆకాంక్షను మనసులోని అణిచివేసుకునే కుటుంబాలు ఎన్నో ఉన్నాయి.

తెలుగు భాషాభివృద్ధిలో భాగంగా ఆంధ్రమహాసభ జనవరి 10 నాడు ఉదయం 10.30 గంటలకు ఉచిత సినిమా ప్రదర్శన ఏర్పాటు చేస్తోంది. మీరంతా కుటుంబ సమేతంగా విచ్చేసి, ఆంధ్రమహాసభ అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం. అందరూ రావొచ్చు. ఉచిత ప్రవేశం.







# మహిళా శాఖ వారి ఆధ్వర్యంలో విహార యాత్ర

**తేది - 17.01.2016, ఆదివారం, ఉదయం 7.00 గంటలకు**

# గ్రీన్ హిల్స్

## రిసార్ట్ & వాటర్ పార్క్



మహారాష్ట్రలోని తెలుగు సంస్థల మాతృ సంస్థగా పేరుపొందిన ఆంధ్రమహాసభ ఈ పరాయి గడ్డపై తెలుగువారిలో భాషా, సాహితీ, సంస్కృతి, కళల పట్ల ఆసక్తి పెంచడమే కాకుండా విజ్ఞాన, వినోద కార్యక్రమాలు కూడా నిర్వహిస్తోంది. ప్రతి సంవత్సరం సభ్యులను సకుటుంబ సమేతంగా విహారయాత్రకు తీసుకెళ్లి ఈ వేగవంతమైన నగరంలో కాసింత ఓదార్పు కలగచేస్తోంది.

ప్రస్తుతం కూడా జనవరి 17 నాడు ఆంధ్రమహాసభ సభ్యుల కోసం విహారయాత్రను ఏర్పాటు చేస్తోంది.

**వివరాలు ఇలా వున్నాయి.**



**విహార స్థలం :**
**నాలాసోపార (ఈస్ట్) లో ఉన్న గ్రీన్ హిల్ రిసార్ట్.**
**తేది : 17.01.2016 ఆదివారం.**

**ప్రవేశ రుసుం :**

- **ఆంధ్రమహాసభ జీవిత సభ్యులకు ప్రతి వ్యక్తికి రూ॥ 200/-** (సభ్యుడి తల్లిదండ్రులకు, భార్య, పెళ్ళి కాని పిల్లలకు కూడా రూ॥ 200/- మాత్రమే. అయిదు సంవత్సరాల లోపు పిల్లలకు ఉచిత ప్రవేశం.)
- **ఆంధ్రమహాసభ సభ్యులు కాని వారికి ప్రతి వ్యక్తికి రూ॥ 800/- మాత్రమే.** (అయిదు సంవత్సరాల పిల్లలకు ఉచితం)
- **వీలును బట్టి బస్సులు వివిధ ప్రాంతాల నుండి బయలుదేరుతాయి. వివరాలకు ఆంధ్రమహాసభ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.**
- **తమ పేర్లను నమోదు చేయించుకోవడానికి చివరి తేది: 15.01.2016**
- **సభ్యులు తమ గుర్తింపు కార్డులను వెంటతెచ్చుకోవలెను.**





గ్రీన్ హిల్ రిసార్ట్ మంచి ఆహ్లాదకరమైన పరిసరాల్లో ఉంది. ఇందులో మూడు స్విమ్మింగ్ పూల్స్ ఉన్నాయి. మహిళల విశ్రాంతి కోసం, స్విమ్మింగ్ కోసం ప్రత్యేక గదులు, స్విమ్మింగ్ పూల్ కూడా ఉన్నాయి.

ఆంధ్రమహాసభ మహిళాశాఖ అధ్వర్యంలో జరుగుతున్న ఈ విహారయాత్రా స్థలంలో పలు రకాలైన గేమ్స్, సింగింగ్ పోటీలు వగైర నిర్వహించి విజేతలకు బహుమతులు కూడా అందిస్తారు. హైదరాబాద్ నుండి ప్రత్యేకంగా ఒక మహిళా యాంకర్‌ను రప్పించి మహిళల కోసం అసక్తికరమైన కార్యక్రమాలు రూపొందిస్తారు. అంతేగాక, సంగీత ప్రియుల కోసం డీజే కూడా ఏర్పాటు చేయనున్నారు. విజ్ఞానం, వినోదం కలిగించే ఈ విహారయాత్రలో అందరూ పాల్గొనాలనీ మనవి.

**విహార యాత్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి టీలు, టిఫిన్స్, భోజనాలు ఉచితంగా అందించబడతాయి.**

# ది బొంబాయి ఆంధ్ర మహాసభ & జింఖానా

# The Bombay Andhra Mahasabha & Gymkhana

10-C, Lakhamsi Napoo Road, Dadar (E), Mumbai - 400014. Tel. 24144377 / 24144388, Fax: 24119832.

ONE DAY PICNIC TO

## "GREEN HILLS RESORT & WATER PARK"

Vanothepada, Nallasupara Phata, Pelhar-Nallasopara Road, Nallasopara (East), Mumbai - 401 208

## Entry Form

Name: ______________________________________________________________

Address: ____________________________________________________________

Contact No: __________________ Life Membership No.: _____________No. of Persons: _____

Details of the persons participating:

| Sr. No. | Name | Age | Gender | Relationship | Amount | Remark |
|---|---|---|---|---|---|---|
| 1 | | | | | | |
| 2 | | | | | | |
| 3 | | | | | | |
| 4 | | | | | | |
| 5 | | | | | | |
| 6 | | | | | | |
| Receipt No.: | Date: | | | Total Amount | | |

## Entry Fees

**Life Members**

**For Life Members & their Family i.e. Spouse, Unmarried Children & Parents**
**Rs.200/- per Person**

**Others**

**For Others and their Family members i.e. Childrens & Elders**
**Rs.800/- per Person**

**Childrens below 5 years - Free ( seat in bus will not be provided )**

**The fee includes Traveling, Entry Fee to Resort, Breakfast, Lunch and evening Snacks & Tea and all Resort Water Games**

______________________________
Signature of Member

## NOTE

**The ENTRY PASSES will be issued at Mahasabha only after making necessary payments.**
**Without Entry Passes Members will not be allowed to enter the Resort.**
**Last Date for receiving payment & issuing Entry Passes 15.01.2016 before 8pm**
**Swimming Costume is compulsory for all.**

పి. పాండురంగం : 9833508311
పి. సతీష్ : 7506897643

!! హరే కృష్ణ !!

ఫోన్ : 2430 9171
సోమవారం 2.00 గం. వరకు







# శ్రీ కృష్ణ జ్యేలర్స్



సంస్థాపకులు
కాలిదాస్, క్రాంతి & బ్రదర్స్



మా వద్ద తెలుగువారి అన్ని రకముల బంగారము ఆభరణాలు 23 KDM, 916 హాల్‌మార్క్‌తో గ్యారంటీగా చేయబడును. తయారు నగలు, వెండి పట్టగొలుసులు, నవరత్నములు లభించును


మా సంస్థ ద్వార దక్షిణ ముంబయిలో 3 బ్రాంచిలు నమ్మకముతో విజయవంతముగా కొనసాగుచున్నవి.

## శ్రీ కృష్ణ జ్యేలర్స్ బంగారం స్కీం చిట్టీ సౌకర్యము

| ప్రతి నెల జమా రూ. | మొత్తం నెలలు | మొత్తం జమా రూ. | బంగారు ఆభరణము లభించును | నగదు రూపము/ ప్యూర్ బంగారం |
|---|---|---|---|---|
| 500 | 15 | 7500 | 8500 | 8000 |
| 1000 | 15 | 15000 | 17000 | 16000 |
| 1500 | 15 | 22500 | 25500 | 24000 |
| 2000 | 15 | 30000 | 34000 | 32000 |
| 3000 | 15 | 45000 | 51000 | 48000 |

షాప్ నం. 3, మావ్‌జి మెన్షన్, రాణు శేర్ బిల్డింగ్ ఎదుట, ఖేడ్‌గల్లి,
సయాని రోడ్, ప్రభాదేవి, దాదర్ (ప), ముంబయి - 400 025.

Advt.



# విజయోత్సవం





క్రీడలు కేవలం ఉత్సాహానికే కాదు దేహదారుఢ్యానికి కూడా అత్యవసరం. ఆరోగ్యకరమైన యువత భావిభారతానికి ప్రగతి దీపం. ఆంధ్రమహాసభ తెలుగువారి మనుగడ, తెలుగువారి ఉనికిని కాపాడుతూ మహారాష్ట్రలో తెలుగువారి కీర్తిపతాకాన్ని విజయవంతంగా ఎగరేయడంలో తనవంతు పాత్ర పోషిస్తోంది. అదే పరంపరలో ఆంధ్రమహాసభ క్రికెట్ టీంను కూడా ఏర్పాటు చేసిన విషయం విధితమే..

21 మంది యువకులతో ఏర్పాటు చేసిన ఆంధ్రమహాసభ క్రికెట్ టీం విజయవంతంగా ముందుకు సాగుతోంది. తేది: 19 డిసెంబర్, 2015 నాడు ఆజాద్ మైదానంలో జరిగిన టోర్నమెంట్‌లోలో పాల్గొని విజయాన్ని సాధించింది. వివరాలు ఇలా ఉన్నాయి. చిలుక వినాయక్ నేతృత్వంలో దాసరి భాస్కర్ వైస్ ప్రెసిడెంట్‌గా, చిల్వేరి రమేశ్ వికెట్ కీపర్‌గా, శివరాత్రి వినాయక్, శివరాత్రి మారుతి, అడ్డగట్ల విశాల్, సిరిమల్లె రాహుల్, గుండేటి ప్రశాంత్, తోట మధు, అడ్డగట్ల విశాల్, రచ్చ సాయిక్రిష్ణ, తోట రాజశ్రీ తదితర క్రీడాకారులతో కూడిన టీం విజయఢంకా మోగించింది.

ఆజాద్ మైదానంలో పగలు రెండు గంటలకు జరిగిన 20 ఒవర్ల ఏపీఎల్ మాస్టర్స్ ట్రాఫీ – 2015 టోర్నమెంట్ లో ప్రత్యర్థి టీం జీపీటీ క్రికెట్ క్లబ్ పై 8 వికెట్లతో ఘనవిజయం సాధించింది. ప్రత్యర్థి టీం ముందుగా ఆడుతూ 18 ఒవర్లలో 101 పరుగులు సాధించగా ఆంధ్రమహాసభ టీం కేవలం రెండు వికెట్ల నష్టానికే 14 ఒవర్లలోనే లక్ష్యాన్ని సాధించింది.



ఆంధ్రమహాసభ టీం కెప్టెన్ చిలుక వినాయక్ 42 పరుగులు సాధించడమే కాకుండా ఒక వికెట్ కూడా తీసుకొని 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును గెలుచుకున్నాడు. ఆంధ్రమహాసభ టీం భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలెన్నో సాధించాలని కోరుకుంటూ అభినందనలతో పాటు శుభాకాంక్షలు కూడా అందిస్తున్నాం. మీరూ అందించండి...!

**ధర్మకర్తల డెస్క్ నుండి...**

# శుభ సందేశం



గత కొంతకాలంగా ఆంధ్రమహాసభ డెవలప్‌మెంట్ గురించి పలు విధాలుగా, ధర్మకర్తల మండలి, కార్యవర్గంతో పాటు ప్రత్యేక నిపుణుల బృందం చేస్తున్న కృషి నేటికి ఫలించింది. ఎన్నో రకాల సాంకేతిక ఇబ్బందుల్ని, టెండర్ల ప్రక్రియని ఎంతో పారదర్శికంగా పూర్తి చేసుకొని చివరి మజిలీని చేరుకుందని తెలియచేయడానికి ఎంతో సంతోషిస్తున్నాం.

అక్కడక్కడ శిథిలావస్థకు చేరుకున్న ఆంధ్రమహాసభ భవన మరమ్మత్తుల కోసం సర్వ సభ్యుల అనుమతితో నిర్మాణ ప్రక్రియను ఆరంభించిన సంగతి అందరికీ తెలిసిందే. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక ప్రాపర్టీ సబ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీకి ధర్మకర్తల మండలి చైర్మెన్ పోతు రాజారాం అధ్యక్షుడిగా, కే. బాబూరావు కార్యదర్శిగా, నీల నాగేశ్వరరావు కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. అంతేగాక, ఈ కమిటీలో అనుమల్ల రమేశ్, మార్గం రాజ్‌పాల్, రాజగిరి అశోక్, మచ్రి జనార్దన్, సంగం ఏక్‌నాథ్, యాపురం వెంకటేశ్వర్, ధ్యావరిశెట్టి గంగాధర్, బడుగు విశ్వనాథ్, కస్తూరి హరిప్రసాద్, మాదిరెడ్డి కొండారెడ్డి, డి. కమలాకర్, సుల్గే శ్రీనివాస్ లాంటి అనుభవజ్ఞులు సభ్యులుగా ఉన్నారు.

ఈ ప్రత్యేక కమిటీ వివిధ అంశాలపై పలు సమావేశాలు నిర్వహించి మహాసభపై ఎక్కువ ఆర్థిక భారం పడకుండా ఎంతో పకడ్బంధీగా ప్రణాళికను రూపొందించడం జరిగింది.

19 డిసెంబర్ 2015 నాడు నిర్వహించిన ప్రత్యేక కమిటీ సమావేశంలో మోనాలిసా కన్‌స్ట్రక్షన్ కంపెనీకి రూ॥ 81,28,425/- (అక్షరాల ఎనభై ఒక్క లక్ష ఇరవై ఎనిమిది వేల నాలుగు వందల ఇరవై అయిదు రూ॥ మాత్రమే) (పన్నులు అదనం) కు టెండర్ ప్రదానం చేయడం జరిగింది. వచ్చిన టెండర్లలో అత్యల్ప మొత్తాన్ని అఫర్ చేసిన మోనాలిసా కన్‌స్ట్రక్షన్ కంపెనీతో సంప్రదింపులు జరిపి మరింత తక్కువకు టెండర్‌ను అందించడం జరిగింది.


ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఆంధ్రమహాసభ మరమ్మత్తుల పనుల కోసం సోమవారం తేది 4 జనవరి 2016 రోజు ఉదయం 9.00 గంటలకు సుముహూర్తంగా నిర్ణయించడం జరిగింది. స్థానిక శాసన సభ సభ్యులు కాళిదాస్ కోలంబ్‌కర్ శుభహస్తాలతో వేదపండితులచే శాస్త్రోక్తంగా ప్రారంభోత్సవం జరుగుతుందని తెలియచేయడానికి ఎంతో సంతోషిస్తున్నాం.


ఈ కార్యక్రమానికి ఆంధ్రమహాసభ సభ్యులంతా భారీ సంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయాలనీ కోరుతున్నాం. ఈ మహాయజ్ఞంలో మీరంతా సహాయ సహకారాలను అందించాలని మనవి చేస్తున్నాం.

**ధన్యవాదములు,**

**పోతు రాజారాం**
చైర్మెన్

**అనుమల్ల రమేశ్**
కార్యదర్శి





# తెలుగు ప్రజలందరికీ

పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.
నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతున్న వేళ
మీరంతా నిత్యకళ్యాణం పచ్చతోరణంలా
కళకళలాడుతూ ఉండాలనీ,
అష్టఐశ్వర్యాలతో తులతూగాలనీ
మనస్ఫూర్తిగా కోరుకుంటూ....

## నూతన సంవత్సర మరియు సంక్రాంతి పర్వదిన



# శుభాకాంక్షలు





## యెలిగేటి రాజ్‌కుమార్

పరిపాలనా శాఖ సంయుక్త కార్యదర్శి,
ది ఆంధ్రమహాసభ అండ్ జింఖానా, దాదర్.



ముంబయి తెలుగు ఎడ్యుకేషన్ సొసైటీ
MUMBAI TELUGU EDUCATION SOCIETY
मुंबई तेलुगु ऐज्युकेशन सोसायटी
MTES's
Disha
Technical Institute
గత జ్ఞాపకాలను నెమరు వేస్తూ... కొత్త ఆశలకు ఊపిరి పోస్తూ...
అభ్యుదయం ఆకాంక్షిస్తూ...
ప్రకృతిలో అందాన్ని... సున్నితమైన భావాన్ని... అందమైన మనస్సుని...
రాబోయే క్రొత్త సంవత్సరంలోనే కాకుండా... జీవితాంతం ఆస్వాదిస్తూ,
ఆనందిస్తూ ఉండాలని ఆశిస్తూ..... తెలుగు ప్రజలందరికీ...
నూతన సంవత్సర మరియు
సంక్రాంతి పర్వదిన
శుభాకాంక్షలు
2016
HAPPY NEW YEAR
Ramesh Manthena
Founder Chairman
Kasturi Hariprasad
Working President
Sherla Prallad
General Secretary


Advt.

॥ గణేశయ నమ ॥

అవినాశ్ పాటిల్
మయూర్ అవినాశ్ పాటిల్
అస్మిత అవినాశ్ పాటిల్

# మయూర్ క్యాటరర్స్

## మరియు డెకొరేటర్స్



సమస్త తెలుగు ప్రజలందరికీ హార్ధిక

# నూతన సంవత్సర శుభాకాంక్షలు



పెళ్లి మరియు ఇతర శుభకార్యములకై
రుచికరమైన భోజనాల కొరకు సంప్రదించండి

93222 24550 / 93249 23020 / 93242 42458 / 98211 47636
90042 00752 / 76668 96756 / 93200 09652
022 - 24306246 - ఫాక్స్ - 022-24331927

E-mail: mayurcaterers@gmail.com
Web: www.mayurcaterers.net

తావ్‌డే వాడి, రూమ్ నం. 05, భవాని శంకర్ రోడ్, చిత్‌లే పత్, పోర్చగిస్ చర్చ్ వెనుక,
వర్తక్ హాల్ పక్కకు, దాదర్ (ప.), ముంబాయి - 400 028

Advt.